ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

# నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -347 పేజీలు - 08 వెల - 04/- శనివారం15 నవంబర్ 2025



# డ్రోన్ స్పేస్ సిటీ లతో కొత్త శకం..!

## విశాఖలో సీఐఐ సదస్సు వేదికగా చారిత్రాత్మక ఘట్టం



**విశాఖపట్నం,నవంబర్14ఆంధ్ర ప్రగతి**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏరోస్పేస్, అంతరిక్ష రంగాల్లో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న 'డ్రోన్ సిటీ', 'ట్విన్ స్పేస్ సిటీస్' ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైందిమిగతా 2లో...

### డ్రోన్, స్పేస్ సిటీలకు చంద్రబాబు, పీయూష్ గోయల్ శంకుస్థాపన

- రాష్ట్రంలో డ్రోన్ సిటీ, ట్విన్ స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు
- చంద్రబాబు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం
- ఈ ప్రాజెక్టులతో భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు

# బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే సునామీ





- 243 స్థానాలకు గాను 203 సీట్లను కైవసం చేసుకున్న కూటమి
- గతంలో కంటే రెట్టింపు సీట్లు సాధించిన జేడీయూ
- 34 స్థానాలకే పరిమితమై మహాగఠబంధన్
- ఘోరంగా దెబ్బతిన్న ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీ
- మరోసారి బీహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్

**నవంబర్ 14ఆంధ్ర ప్రగతి**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. ఓట్ల లెక్కింపు పూర్తి కాగా... మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను ఏకంగా 203 సీట్లను కైవసం చేసుకున్న ఎన్డీయే, డబుల్ సెంచరీ మైలురాయిని దాటింది. ఈ భారీ విజయంతో బీహార్‌లో మరోసారి డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మిగతాది 2లో...

## మా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వండి

జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో నారా లోకేశ్



2లో.

## గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం

- 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం
- విజనరీ సీఎం చంద్రబాబు వల్లే ఇదంతా సాధ్యం
- ఎపి గురించే కాకుండా దేశం గురించి ఆలోచించే నేత చంద్రబాబు
- సిఐఐ సదస్సులో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్



2లో.

## అభివృద్ధి, సంక్షేమంలో బాబు రోల్ మోడల్

- హైదరాబాద్‌ను గ్లోబన్ ఐటి కేంద్రంగా తీర్చి దిద్దారు
- మోడీ నేతృత్వంలో అర్థికాభివృద్ధి భారత్ దూకుడు
- విశాఖ సిఐఐ సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



విశాఖపట్నం,నవంబర్14**ఆంధ్ర ప్రగతి**అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారురు. ఉమ్మడి ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు మిగతా 2లో...

## పరకామణి కేసులో కీలక వ్యక్తి అనుమానాస్పద మృతి..

- తాడిపత్రి రైల్వే ట్రాక్‌పై మృతదేహం
- తాడిపత్రి రైల్వే ట్రాక్‌పై టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్ కుమార్ మృతదేహం
- గతంలో డాలర్ల దొంగతనంపై ఫిర్యాదు చేసింది సతీశ్ కుమారే
- విచారణ వేళ ఆయన మృతి చెందడంపై పలు అనుమానాలు




2లో.


# విశాఖ సదస్సు బిగ్ హిట్

## ఏపీకి రూ. 11.91 లక్షల కోట్ల పెట్టుబడులు!

- విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు విజయవంతం
- రాష్ట్రానికి రూ. 11.91 లక్షల కోట్ల పెట్టుబడులు
- మొత్తం 400 ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రభుత్వం
- 13.32 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



2లో.



# హస్తం హవా

24,729 ఓట్ల మెజారిటీ

- ఉప పోరులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు
- ప్రతిరౌండ్‌లోనూ ఆధిక్యం ప్రదర్శించిన కాంగ్రెస్
- బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత ఓటమి
- డిపాజిట్ కోల్పోయిన బీజేపీ నాలుగో స్థానంలో నోటా

2 లో



# డ్రోన్ స్పేస్ సిటీ లతో కొత్త శకం..!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని అభివర్ణించారు. "సాంకేతికతలో 'ఫస్ట్ మూవర్స్ అడ్వాంటేజ్'ను అందిపుచ్చుకోవడంలో మేం ఎప్పుడూ ముందుంటాం. ఇప్పటికే క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభించబోతున్నాం, రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నాం. ఇప్పుడు ఈ రెండు ప్రాజెక్టులతో మరో ముందడుగు వేశాం. త్వరలోనే రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తాం. ఇందుకు అవసరమైన డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తే, వీటిని మరింత వేగంగా, అద్భుతంగా తీర్చిదిద్దుతాం" అని చంద్రబాబు తెలిపారు.

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రశంసించారు. "ఒకప్పుడు దేశంలో ఐటీకి గుర్తింపు లేని సమయంలోనే దాని భవిష్యత్‌ను ఊహించి, అవకాశాలను అందిపుచ్చుకున్న ఘనత చంద్రబాబుది. ఇప్పుడు డ్రోన్లు, స్పేస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం టెక్నాలజీ వంటి భవిష్యత్ రంగాల్లో కూడా ఆయన ముందున్నారు. దేశంలోనే తొలిసారిగా డ్రోన్, స్పేస్ సిటీలను నెలకొల్పిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు కలిసికట్టుగా దేశం కోసం, రాష్ట్రం కోసం పనిచేస్తున్నారు" అని కొనియాడారు.




**డ్రోన్ సిటీ ప్రత్యేకతలు**

కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ డ్రోన్ సిటీ నిర్మాణం కానుంది. అంతర్జాతీయ స్థాయిలో డ్రోన్ల డిజైన్, తయారీ, సేవలు, పరిశోధన-అభివృద్ధి (%=డణ%) కేంద్రంగా దీనిని తీర్చిదిద్దనున్నారు. ఇక్కడ అధునాతన తయారీ పార్కులు, టెస్టింగ్, సర్టిఫికేషన్ సెంటర్లను ఏర్పాటు చేస్తారు. 25,000 మందికి రిమోట్ పైలట్ శిక్షణ ఇస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 40,000కు పైగా ఉద్యోగాలు లభిస్తాయని అంచనా.

దీనికోసం రాష్ట్రవ్యాప్తంగా 50 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు 20% క్యాపిటల్ సబ్సిడీ, 100% ఎస్‌జీఎస్‌టీ రాయితీ వంటి ప్రోత్సాహకాలను అందిస్తోంది. ఈ సిటీలో పెట్టుబడులకు అల్గోబోటిక్స్, అకిన్ అనలిటిక్స్, సెన్సెల్మేజ్, ఏర్వేస్ ఇండస్ట్రీస్ వంటి సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

**ట్విన్ స్పేస్ సిటీస్ వివరాలు**

శ్రీ సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో దేశంలోనే తొలిసారిగా 'ట్విన్ స్పేస్ సిటీస్' ఏర్పాటు కానున్నాయి. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేట్ పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఉపగ్రహాల ప్రోటోటైప్ తయారీ, స్పేస్ టెక్ స్టార్టప్‌ల కోసం ఇంక్యుబేషన్ సెంటర్లు, ఉపగ్రహ విడిభాగాల తయారీ, లాంచ్ లాజిస్టిక్స్ సపోర్ట్ వంటి అంశాలకు ఇక్కడ ప్రాధాన్యత ఇస్తారు. రాబోయే 10 ఏళ్లలో ఈ స్పేస్ సిటీ ద్వారా రూ.25,000 కోట్ల పెట్టుబడులు, 35,000కు పైగా ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'లో భాగంగా రూ.100 కోట్లతో ప్రత్యేక 'స్పేస్ టెక్ ఫండ్'ను కూడా ఏర్పాటు చేశారు. బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. ఈ రెండు ప్రాజెక్టులు 'స్వర్ణాంధ్ర 2047' విజన్ లక్ష్యాల సాధనలో కీలకం కానున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జయభేరి

హైదరాబాద్, **,నవంబర్14ఆంధ్ర ప్రగతి**

హైదరాబాద్ జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘన విజయం సాధించారు. మొదటి రౌండ్ నుంచి ఆధిక్యాన్ని ప్రదర్శించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యం కొనసాగింది. కాగా, ఈ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి డిపాజిట్ కోల్పోయారు. శుక్రవారం యూసుఫ్‌గూడ లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఉదయం ఓట్ల లెక్కింపు ప్రారంభమైనప్పటి నుంచి నవీన్ యాదవ్ ఆధిక్యంలో కొనసాగారు. మొత్తం 10 రౌండ్ల లెక్కింపు ముగిసేసరికి ఆయనకు 98,988 ఓట్లు రాగా, మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డికి 17,061 ఓట్లు వచ్చాయి.

**ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ ఆధిక్యం**

ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నారు. మొదటి రౌండ్‌లో కాంగ్రెస్‌కు 8,911 ఓట్లు, బీఆర్ఎస్‌కు 8,864 ఓట్లు లభించడంతో.. 47 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో కాంగ్రెస్ తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. రెండో రౌండ్‌లో కాంగ్రెస్ 9,691 ఓట్లు సాధించగా, బీఆర్ఎస్ 8,609 ఓట్లు పొందింది. ఐదో రౌండ్ ముగిసేసరికి కాంగ్రెస్ ఆధిక్యం 12,859 ఓట్లకు చేరింది. ఆరో రౌండ్ నుంచి తొమ్మిదో రౌండ్ ముగిసే సమయానికి కాంగ్రెస్ ఆధిక్యం 23,921 ఓట్లకు పెరిగింది. మధ్యలో కొన్ని రౌండ్లలో బీఆర్ఎస్ పుంజుకున్నప్పటికీ కాంగ్రెస్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ విజయం దిశగా సాగింది. కౌంటింగ్ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుతో ప్రారంభం కాగా, అందులోనూ కాంగ్రెస్‌కే ఎక్కువ ఓట్లు లభించాయి. మొత్తం 101 పోస్టల్ ఓట్లు పోలవ్వగా, 96 చెల్లిన ఓట్లలో కాంగ్రెస్‌కు 43, బీఆర్ఎస్‌కు 25, బీజేపీకి 20 ఓట్లు వచ్చాయి.

**బీఆర్ఎస్ గట్టి పోటీ.. బీజేపీకి నిరాశ**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ స్థానాన్ని దక్కించుకునేందుకు ఆ పార్టీ తీవ్రంగానే శ్రమించింది. జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని గట్టి ప్రయత్నమే చేసింది. ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారు. ప్రతి రౌండూ ముగిసేసరికి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత వెనుకంజలోనే ఉన్నారు. సానుభూతి ఏమాత్రం పని చేయలేదు. ఈ ఎన్నికలో ప్రభావం చూపుతామని భావించిన బీజేపీకి తీవ్ర నిరాశే ఎదురైంది. కేంద్ర మంత్రులు తిరిగినా ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపలేదు. ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కోల్పోయారు. ఈ గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి.

**నోటాకు 1863 ఓట్లు**

ఈ ఎన్నికలో ప్రధాన పార్టీలతో పాటు పలు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో ఉండటం గమనార్హం. అయితే, ఏ అభ్యర్థికీ ఓటు వేయని వారి సంఖ్య కూడా గణనీయంగానే ఉంది. నోటాకు 1,863 ఓట్లు రావడం, ప్రధాన పార్టీల తర్వాత నాలుగో స్థానంలో నిలవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇతర అభ్యర్థులకు వెయ్యి కంటే తక్కువ ఓట్లు వచ్చినట్టు ఎన్నికల కమిషన్ వెల్లడించిన గణాంకాల ప్రకారం తెలుస్తోంది. మొత్తానికి ఈ ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని చేకూర్చినట్టయింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోవడం బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**బీఆర్ఎస్‌లో నిరాశ..కాంగ్రెస్‌లో ఉత్సాహం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమితో కేడర్‌లో నిరాశ నెలకొంది. అధికార పార్టీ కంటే ప్రచారంలో ముందున్నా ఓట్లు తక్కువగా రావడాన్ని తట్టుకోలేకపోతున్నారు. ప్రభుత్వ వ్యతిరేకతను అన్ని రకాలుగా ప్రచారం చేసినా కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ ఓట్లు రావడం.. మెజార్టీ కూడా భారీగా రావడం పట్ల బీఆర్ఎస్ నేతలు దిగులు చెందుతున్నారు. ఈ ఓటమి భవిష్యత్‌లో జరగబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఏరకంగా ప్రభావం చూపించబోతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ గెలుపు కాంగ్రెస్ పార్టీలో జోష్ పెంచింది. జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో పాగా వేయొచ్చన్న ఉత్సాహంలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

కార్యక్రమాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి సీఎం మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో తమపార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ విజయం కోసం కృషి చేసిన అందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# విశాఖ సదస్సు బిగ్ హిట్

**విశాఖపట్టణం,నవంబర్14ఆంధ్ర ప్రగతి**

. మొత్తం 400 అవగాహన ఒప్పందాల (ఎంఓయూ) ద్వారా సుమారు రూ. 11,91,972 కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం ఆకర్షించింది. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్రంలో 13,32,445 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రభుత్వం ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన రావడంతో జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. సదస్సు ప్రారంభమైన తొలిరోజే రూ. 8.26 లక్షల కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 12.05 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. ఇక రెండో రోజు ముఖ్యమంత్రి సమక్షంలో 41 ఎంఓయూల ద్వారా రూ. 3.50 లక్షల కోట్లు, ఇతర మంత్రుల సమక్షంలో 324 ఒప్పందాల ద్వారా రూ. 8.41 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు జరిగాయి. ఇంధనం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు-వాణిజ్యం, ఏపీ సీఆర్డీఏ, మున్సిపల్ శాఖల పరిధిలో ఈ కీలక ఒప్పందాలు కుదిరాయి. ఈ సదస్సు విజయవంతం కావడం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 400 ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు జరిగిన ఒప్పందాల ద్వారా రూ. 11,91,972 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. 13,32,445 ఉద్యోగాలపై హామీ పొందింది. ఇవీ గత రెండు రోజులుగా వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూల విలువ. మొత్తంగా 7 రంగాల్లో భారీగా పెట్టుబడులు వచ్చాయి. ఏపీసీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు - వాణిజ్యం, ఐటీ, మున్సిపల్ శాఖల్లో ప్రభుత్వం వివిధ కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. దీంతో విశాఖ సమ్మిట్ మొదటి రోజునే బిగ్ హిట్ అయింది. ప్రభుత్వ అంచనాలకు మించి పరిశ్రమలు స్పందించాయి. మొత్తంగా 410 ఎంఓయూల ద్వారా రూ. 10 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకుంది. అయితే ఆ అంచనాలకు మించి పారిశ్రామిక వేత్తల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.

**ముఖ్యమంత్రి సమక్షంలో...**

భాగస్వామ్య సదస్సు సందర్భంగా గత రెండు రోజుల్లో సీఎం సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ. 7,15,490 కోట్ల పెట్టుబడులను ఆకర్షించి, 5,42,761 మంది ఉద్యోగాలకు హామీ పొందింది రాష్ట్ర ప్రభుత్వం. భాగస్వామ్య సదస్సు తొలి రోజున వివిధ రంగాలకు చెందిన కంపెనీలతో ముఖ్యమంత్రి వరుస భేటీలు నిర్వహించారు. గురువారం వరుసగా 15 భేటీలు నిర్వహిస్తే.. శక్రవారం కూడా దాదాపు అదే స్థాయిలో ముఖ్యమంత్రి వరుస సమావేశాల్లో పాల్గొన్నారు. శుక్రవారం సీఎం సమక్షంలో ఎంఓయూలు చేసుకున్న సంస్థల్లో ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్, ఎకోరెన్ ఎనర్జీ, జాక్సన్ గ్రీన్, జీఎంఆర్ ఎనర్జీ, ఎస్సార్ రెన్యువబుల్స్, వారీ గ్రూప్, సీసన్ గ్లోబల్ ట్రేడింగ్, ఎస్ఏఈఎల్, జేఎం బాక్సీ, శ్రీ సిమెంట్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్, హిందుస్థాన్ షిప్‌యార్డ్, టాటా పవర్, పతంజలి ఫుడ్, ఇండస్ కాఫీ, కెల్లాగ్ ఇండియా తదితర సంస్థలు ఉన్నాయి.

ఇక విడివిడి భేటీల్లో రాష్ట్రంలో ఉన్న పెట్టుబడులను ఆయా కంపెనీలకు చెందిన ప్రతినిధులకు ఆసాంతం వివరిస్తూ... పెట్టుబడులు పెట్టాల్సిందిగా ముఖ్యమంత్రి కోరారు. అలాగే పారిశ్రామికాభివృద్ధికి చేపడుతున్న చర్యలను వివరించారు. వీటితో పాటు.. కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి రాయితీలు వచ్చే పరిస్థితి ఉంటే.. వాటిని కూడా వచ్చేలా తాము సహకరిస్తామని సీఎం ఆయా కంపెనీల ప్రతినిధులకు వివరించారు. భాగస్వామ్య సదస్సు తొలిరోజు జరిగిన ఒప్పందాల కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధనరెడ్డి, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

**మంత్రుల సమక్షంలోనూ భారీగా ఒప్పందాలు...**

ఇక వివిధ శాఖలకు చెందిన మంత్రులు కూడా భాగస్వామ్య సదస్సు తొలి రోజున భారీ ఎత్తున ఒప్పందాలు చేసుకుని భారీ పెట్టుబడులను రాబట్టారు. మంత్రులందరూ కలిసి మొత్తంగా 324 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని రూ. 4,76,482 కోట్లు పెట్టుబడులకు హామీ పొందారు. ఈ ఒప్పందాల ద్వారా 7,88,884 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. తొలి రోజు సదస్సులో ఒప్పందాలు కుదుర్చుకున్న మంత్రుల్లో నారా లోకేశ్, టీజీ భరత్, గొట్టిపాటి రవి, బీసీ జనార్దన్ రెడ్డి, నారాయణ ఉన్నారు. నారా లోకేశ్ రూ. 1,38,752 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకోగా... మిగిలిన మంత్రులు కూడా భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకున్నారు.

# తిరుమల పరకామణి కేసులో కీలక వ్యక్తి అనుమానాస్పద మృతి..

తాడిపత్రి **,నవంబర్14ఆంధ్ర ప్రగతి**

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరకామణి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ సహాయ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి (ఏవీఎస్వో) సతీశ్ కుమార్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని కోమలి రైల్వే ట్రాక్‌పై ఆయన విగతజీవిగా కనిపించడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రస్తుతం ఈ కేసును సీఐడీ బృందం విచారిస్తుండగా, దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో ఈ ఘటన జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.వివరాల్లోకి వెళితే.. తిరుమల పరకామణిలో విదేశీ డాలర్లను రవికుమార్ అనే వ్యక్తి దొంగిలించాడని ఆరోపిస్తూ అప్పటి ఏవీఎస్వోగా ఉన్న సతీశ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. అయితే, అనూహ్యంగా సతీశ్ కుమార్ కోర్టులో ఆ కేసును రాజీ చేసుకున్నారు. కొందరు రాజకీయ నాయకులు, టీటీడీ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఒత్తిడితోనే ఆయన రాజీకి అంగీకరించారని అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి.

ఈ రాజీ వ్యవహారంపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కేసు తిరిగి విచారణకు వచ్చింది. ప్రస్తుతం సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని బృందం ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసింది. విచారణ కీలక దశకు చేరుకుంటున్న సమయంలో, కేసులో అత్యంత ముఖ్యమైన వ్యక్తిగా ఉన్న సతీశ్ కుమార్ రైల్వే ట్రాక్‌పై శవమై తేలడం వెనుక కుట్ర కోణం ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పరకామణి కేసు మరోసారి వార్తల్లోకి ఎక్కింది.

# గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం

## సిఐఐ సదస్సులో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్

**విశాఖపట్టణం,నవంబర్14ఆంధ్ర ప్రగతి**

గ్లోబల్ ట్రేడ్ గేట్ వేగా విశాఖపట్నం నిలుస్తోందని కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఉద్ఘాటించారు. స్టీల్ ఉత్పత్తి, ఆక్వా రంగాల్లో ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందిందని అభివర్ణించారు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌తో ఏపీ సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం అవుతోందని వివరించారు. 2047 నాటికి సుసంపన్నమైన దేశంగా భారత్ అవతరిస్తుందని చెప్పుకొచ్చారు. విజనరీ సీఎం చంద్రబాబు ఉన్న ఏపీలో పుట్టిన ప్రతీ బిడ్డా అదృష్టవంతుడేనని... వారి భవిష్యత్ అంతా ఉజ్వలమైనదేనని గోయల్ వ్యాఖ్యానించారు. విశాఖపట్నంలోని సీఐఐ పెట్టుబడుల సదస్సులో పీయూష్ గోయల్ పాల్గొని ప్రసంగించారు. ఏపీ అభివృద్ధి గురించి మాత్రమే కాదని.. యావత్ భారతదేశం అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ఆలోచిస్తారని ప్రశంసించారు. టెక్నాలజీ ద్వారా ఈ సుసంపన్నతను సాధిస్తామని పేర్కొన్నారు. టెక్నాలజీ డెమొక్రటైజేషన్ అనే విధానాన్ని పాటిస్తూ అందరికీ దానిని చేరువ చేస్తున్నామని వివరించారు. భారత్ తెచ్చిన డిజిటల్ పేమెంట్ విధానం ఇప్పుడు చాలా దేశాలు అనుసరిస్తున్నాయని తెలిపారు. 30 బిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులతో సెమీ కండక్టర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా మని పీయూష్ గోయల్ వెల్లడించారు. 104 శాటిలైట్లను ఒకేసారి అంతరిక్షంలోకి పంపిన దేశంగా సాంకేతికతను ప్రజలకు దగ్గర చేస్తున్నామని నొక్కిచెప్పారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ఆ దిశగా పనిచేస్తున్నామని వివరించారు. ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఉన్న భారత యువత ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. వసుదైక కుటుంబం అనే భారతీయ భావనను కోవిడ్ సమయంలో 110 దేశాలకు వ్యాక్సిన్ సరఫరా చేసి నిరూపించామని ఉద్ఘాటించారు. స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుని దానికి అనుగుణంగా వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తున్నామని పీయూష్ గోయల్ వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా, జీఎస్టీ సంస్కరణలతో ప్రజలందరికీ ఆర్థిక అభివృద్ధి దిశగా పయనిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా భిన్నమైన పరిస్థితులు ఉన్నా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెద్దఎత్తున భారత్ ఆకర్షిస్తూనే ఉందని వివరించారు. అత్యంత పారదర్శకమైన విధానంలో వాణిజ్యం ఉండాలని తాము కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సీఐఐ సదస్సులతో సరికొత్త పెట్టుబడులు, ఆలోచనలు, ఆవిష్కరణలు రావటం అభినందనీయమని అన్నారు. వాణిజ్య ప్రదర్శనలకు, ఎగ్జిబిషన్లు, సదస్సులకు వీలుగా ఢిల్లీలో భారత్ మండపం ఉన్నట్లే ఆంధ్రా మండపం నిర్మించడానికి తాము సిద్ధంగా ఉన్నామని పీయూష్ గోయల్ స్పష్టం చేశారు.

# అభివృద్ధి, సంక్షేమంలో బాబు రోల్ మోడల్

.

30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోందన్నారు. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరిస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయన్నారు. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధి దోహదం చేస్తున్నాయని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామి ఇలా వేర్వేరు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయని ఉపరాష్ట్రపతి వెల్లడించారు.గవర్నెన్సు, డిజిటల్ ఇన్ ఫ్రా ద్వారా వేగంగా సేవలు అందుతున్నాయన్నారు. టెక్నాలజీ నాలెడ్జి డ్రివెన్ ఎకానమీ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోనూ, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయం అంటూ ఉపరాష్ట్రపతి అందరికీ పిలుపునిచ్చారు. వచ్చే రెండు మూడేళ్లలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందన్నారు. అలాగే అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టంగానూ భారత్ ఎదుగుతుందని పేర్కొన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుందని.. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిది అని అన్నారు. ఇతరులకు నష్టం కలిగించటం కాదు, ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

# మా విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇవ్వండి



**జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో నారా లోకేశ్**

**విశాఖపట్టణం,నవంబర్14ఆంధ్ర ప్రగతి** ఆంధ్రప్రదేశ్ యువత కోసం పర్యావరణ, ఆరోగ్య సంరక్షణ, సస్టైయినబుల్ టూరిజం రంగాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. ఈ మేరకు ఆస్ట్రేలియా కాన్సులేట్ జనరల్ జిలాయ్ సాకి, జేమ్స్ కుక్ యూనివర్సిటీ ప్రతినిధులతో నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రస్తుతం జేమ్స్ కుక్ యూనివర్సిటీ సింగపూర్ క్యాంపస్ ఆగ్నేసియా భారతీయ విద్యార్థులకు సేవలందిస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో 1057 కి.మీ.ల సువిశాల సముద్రతీరం ఉంది. ఫిషింగ్, ఆక్వాకల్చర్, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థ నిర్వహణపై మారిటైమ్, తీర ప్రాంత పరిశోధనలకు ఏపీ వర్సిటీలతో కలసి పనిచేయండి. గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌లో ట్రోపికల్ వ్యాధులు, ఆరోగ్య సంరక్షణ, పాండమిక్ ప్రిపేర్డ్ నెస్‌పై ఏపీ వర్సిటీలతో కలసి ఉమ్మడి పరిశోధనలు చేపట్టండి. ఆంధ్రప్రదేశ్ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలకు అనుగుణంగా టెక్నాలజీ, పాలసీ రిసెర్చికి సహకారం అందించండి. వ్యవసాయ, పట్టణ నీటి అవసరాలకు జలవనరుల నిర్వహణలో నైపుణ్యం కోసం ఏపీతో కలిసి ట్రోఫికల్ వాటర్ రిసెర్చ్ గ్రూప్ ఏర్పాటు చేయాలి' అని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఇకపోతే సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ఏపీ పెవిలియన్‌ను మంత్రి లోకేశ్ ప్రారంభించారు. పెవిలియన్ మొత్తం కలియ తిరిగి అందులో ఏర్పాటు చేసిన వివిధ సాఫ్ట్ వేర్, ఏఐ ఇంటిగ్రేటెడ్ అప్లికేషన్స్‌ను పరిశీలించారు. నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి లోకేశ్ వెంట కేంద్ర మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల అభివృద్ధి పనులను పరిశీలించిన ఎన్ఎండి ఫయాజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 14:** దృష్టి సాధించే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ శుక్రవారం నాడు నంద్యాల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న బిల్డింగ్ అభివృద్ధి పనుల పురోగతిని ఫయాజ్ క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల నాణ్యత మరియు వేగం గురించి ఆయన నేరుగా బిల్డింగ్ కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకున్నారు. పనులు నిర్ణీత గడువులోగా, ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు తెలిపారు. అలాగే పాఠశాలలో అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వహణపై ఫయాజ్ ఆరా తీశారు. భోజనం నాణ్యత, విద్యార్థులకు అందిస్తున్న వంటకాల వివరాలు, మరియు పరిశుభ్రత గురించి ఉపాధ్యాయురాలును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంలో అధికారులు మరియు ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థినులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుందని , వీటిని పర్యవేక్షించడం తమ కర్తవ్యమని ఎన్ఎండి ఫయాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రవి, ఈశ్వర్, దీపక్ రెడ్డి, అలీ, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

## మంచాల అవినాష్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 14:** నంద్యాల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మంచాల అవినాష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానందరెడ్డి అవినాష్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, యువతలో మంచి నాయకత్వ గుణాలు ఉన్న అవినాష్ భవిష్యత్తులో మరెన్నో ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, ఆనంద సంతోషాలతో జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మంచాల విజయ భాస్కర్ రెడ్డి, గుడారవి, సాయి తేజ, హర్షద్, సాయి కుమార్, దీపక్, వెంకటేష్, శ్రీకాంత్, నరేంద్ర, ప్రహర్ష పలువురు పార్టీ నాయకులు,యువత నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయం గ్రామోత్సవ కార్యక్రమం..!

-గ్రామ ఉత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి. -పట్టణ పురవీధుల గుండా గ్రామోత్సవం.

-అనంతరం ఉత్తర శబరిమల ఆలయంలో పడిపూజ కార్యక్రమం.

-వచ్చే అయ్యప్ప భక్తులకు అన్నదానం ఏర్పాటు.



**ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ నవంబర్ 14:** ఆళ్లగడ్డలోని ఉత్తర శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయంలో గ్రామోత్సవ కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్తర శబరిమల అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణ కమిటీ వారు తెలిపారు. ఈ గ్రామోత్సవం పడకండ్ల బ్రిడ్జి వద్ద మార్కండేయ స్వామి దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు, టీవీ రోడ్డు, నాలుగు రోడ్ల సర్కిల్, నంద్యాల రోడ్డు మీదుగా ఉత్తర శబరిమలై అయ్యప్ప స్వామి దేవాలయానికిచేరుకుంటుందన్నరు. అనంతరం ఆలయంలో పడిపూజ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది దాకా అయ్యప్ప స్వామి భక్తులు రానున్నట్లు వారు తెలిపారు.

## లింగమయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ.



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ నవంబర్ 14:** ఆళ్లగడ్డ నియోజవర్గం సిరివెళ్ల మండలానికి చెందిన గ్రామనికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు పీపీ. లింగమయ్య అనారోగ్యంతో నంద్యాలలోని న్యూరో కేర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అక్కడికి వెళ్లి పీపీ. లింగమయ్యను పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి, అనంతరం డాక్టర్లతో మాట్లాడుతూ మంచి మెరుగైన చికిత్స అందించాలని తెలియజేశారు.

## మంత్రి ఫరూక్ కు కృతజ్ఞతలు తెలిపిన ఇమాముల సంఘం.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 14:** ముస్లిం మైనారిటీల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్ఎండి ఫరూక్ గారు తీసుకుంటున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా, ఇమామ్‌లు మరియు మౌజన్‌లకు 12 నెలల గౌరవ వేతనం కోసం రూ. 90 కోట్ల నిధులను విడుదల చేసినందుకు గాను, జిల్లా ఇమాముల సంఘం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు కృతజ్ఞతలను తెలియజేశారు.

ఈ సందర్భంగా నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన అభినందన సభలో జిల్లా ఇమాముల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి గారు నిలబెట్టుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

**మంత్రి ఎన్ఎండి ఫరూక్ చొరవ అభినందనీయం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం ఎన్నికల హామీని నెరవేర్చడమే కాకుండా, రాష్ట్రంలో మైనారిటీ వర్గాల సంక్షేమానికి తాము కట్టుబడి ఉన్నామని నిరూపించారని సంఘం నాయకులు తెలిపారు. రూ. 90 కోట్ల నిధుల విడుదల నిర్ణయం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఇమామ్‌లు మరియు మౌజన్‌ల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని. ఈ నిధులు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో, ముఖ్యంగా వారి కుటుంబ పోషణకు ఎంతో సహాయపడతాయని వారు పేర్కొన్నారు. "మైనారిటీల సంక్షేమం పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ చాలా మంచిదని. గౌరవ వేతనాల బకాయిలను ఒకేసారి విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఇది రాష్ట్రంలోని ముస్లిం మైనారిటీల పట్ల ముఖ్యమంత్రి కి ఉన్న ఆదరణను తెలియజేస్తుందని," సంఘం నాయకులు తెలిపారు . ఈ సంక్షేమ చర్యకు గాను మంత్రి ఎన్ఎండి ఫరూక్ కృషిని కూడా ఇమాముల సంఘం ప్రత్యేకంగా అభినందించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గార్ల నాయకత్వానికి, అలాగే కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు తమ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని జిల్లా ఇమాముల సంఘం తెలిపారు . రాష్ట్రంలో ముస్లిం మైనారిటీల గౌరవాన్ని, ఆర్థిక భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రకమైనదని వారు కొనియాడారు.

**తెలుగుదేశం పార్టీ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉంది: మంత్రి ఎన్ఎండి ఫరూక్**

మైనార్టీ సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలిపారు . ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆదేశించిన మేరకు, ఇమాములకు మరియు మోజోన్లకు రూ. 90 కోట్ల రూపాయల నిధులను విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని , ముఖ్యమంత్రిగారి చొరవతో ఇమాములు, మోజోన్ల ఆర్థిక భద్రత కోసం రూ. 90 కోట్ల నిధులను విడుదల చేయడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ, ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నిధులు మైనార్టీ వర్గాల సంక్షేమానికి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఇమాముల సంఘం అధ్యక్షులు హాఫీజ్ ఖాజీ మహమ్మద్ అంజద్ భాష సిద్ధికి, ముఫ్తీ మహమ్మద్ రఫీ సాహెబ్, మూలాన ఇబ్రహీం సాహెబ్, హాజీ ఇలియాజ్ సాహెబ్ , మౌలానా అబ్దుల్ రఫీ, హాఫీజ్ మహమ్మద్ ఆజమ్, హాఫీస్ మహమ్మద్ కాజీ మియా, అలీమ్, హుస్సేన్, మన్ నూర్, ఇస్మాయిల్, జబీబుల్లా మరియు ఇమాములు మరియు మత పెద్దలు ఆలిములు తదితరులు పాల్గొన్నారు.

## బాలలకు మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు నేర్పించాలి.

**సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి. -బేతంచెర్ల మెయిన్ ఎంపీపీ స్కూల్ హెచ్ఎం డి. పాపారాయుడు.**

**ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 14:** బేతంచర్ల పట్టణంలోని ఎంపీపీ మెయిన్ స్కూల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో స్కూల్ హెచ్ఎం డి.పాపారాయుడుఅధ్యక్షతన స్వాతంత్ర్య సమరయోధులు మన భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు.వారిని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణ, దానయ్య, శ్రీవాణి, కామాక్షమ్మ, పర్వీన్ భాను, కృష్ణ మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్ఎం డి. పాపారాయుడు, రమణ, దానయ్య, శ్రీవాణి, సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ..బాలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం పిల్లల అవసరాలను గుర్తించడం, వారి హక్కులను రక్షించడం, వారి దోపిడీని అరికట్టడం, పిల్లల సరైన ఎదుగుదల కోసం కృషి చేయడం. 1964లో జవహర్‌లాల్ నెహ్రూ మరణానంతరం, భారత పార్లమెంటులో ఒక తీర్మానం ఆమోదించబడింది. నవంబర్ 14న బాలల దినోత్సవంగా గుర్తించబడింది. బాలల హక్కులు, విద్య మరియు పిల్లల సంక్షేమం గురించి అవగాహన పెంచడానికి భారతదేశం అంతటా ప్రతి సంవత్సరం నవంబర్ 14 న భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజున జరుపుకుంటారు. బాలలకు మన భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలు నేర్పించాలి. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను



,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి, బేతంచెర్ల మెయిన్ ఎంపీపీ స్కూల్ హెచ్ఎం డి. పాపారాయుడు తెలిపారు.అలాగే సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి విద్యార్థులకు ఆరోగ్యం,కాలుష్యం పై అవగాహన కలిగించారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశు భ్రతను ప్రతి ఒక్కరు పాటించాలి. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు వృద్ధి చెందకుండా దోమకాటు నుంచి వచ్చేవిష జ్వరాల నుంచి కాపాడుకోవచ్చని తెలియజేశారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములై గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలి. వాతావరణ కాలుష్యానికి హానికరమైన ప్లాస్టిక్ నిరోధించాలి. ప్లాస్టిక్ ని వాడకుండా మన ఆరోగ్యాలు మనమే కాపాడుకోవాలి. విరివిగా మొక్కలు నాటి మహావృక్షాలుగా తయారు చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించి ఓజోన్ పరిరక్షణ – ఓజోన్ పొరను రక్షించుకోవాలని తెలిపారు. నీటిని వృధా చేయకుండ జల సంక్షోభాన్ని అరికట్టాలని, విద్యార్థులు అనవసరంగా స్మార్ట్ ఫోన్ ఎక్కువ వాడకుడదని తెలియజేశారు.ఆరోగ్యం పై జాగ్రత్తగా ఉండాలని వైద్యనిపుణులను సంప్రదించకుండా నొప్పులు మాత్రలు వాడరాదు.చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు ముక్కు,నోటికి చేతిరుమాలు అడ్డంపెట్టుకోవాలని,నీళ్ళు శరీరానికి తగ్గట్టుగా త్రాగాలని, ముఖ్యంగా పిల్లలు జంక్ ఫుడ్ తినరాదని, తగిన సమయం నిద్రపోవాలని, బహిరంగ ప్రదేశాలలో ఉమ్మి వేయకూడదని, జ్వరం వచ్చిందంటే ప్రభుత్వ వైద్యశాలలో వైద్యనిపుణులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.

## పొదుపు సంఘం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే భూమా

**ఆంధ్ర ప్రగతి గోస్పాడు నవంబర్ 14:** నంద్యాల నియోజకవర్గంలోని గోస్పాడు మండలంలో పొదుపు సంఘాలపై అక్రమ మార్పులు%ొ% అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.టీడీపీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా%ొ% ఇంకా వైసీపీ ప్రభుత్వ కాలాన్ని తలపించే విధంగానే కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నంద్యాల జిల్లా గోస్పాడు మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ ఐక్య సంఘాలు మరియు పొదుపు లక్ష్మి సంఘాల పేరుతో అక్రమ మార్పులకు కొందరు ఎస్ ఈ ఆర్ పి అధికారులు ప్రయత్నించిన విషయం వెలుగులోకి వచ్చింది.కానాలపల్లి గ్రామంలో ప్రస్తుతం ఎన్నికై విధులు నిర్వహిస్తున్న గ్రామ ఐక్య సంఘం అధ్యక్షురాలు వంగళ శివపార్వతిని పక్కనపెట్టి, అలాగే ఎటువంటి అవకతవకలు లేని పొదుపు సంఘాల్లో ఉన్న నాయకులను తొలగిస్తూ ప్రతిపక్షానికి అనుకూలంగా ఉన్న వ్యక్తులను ఏకపక్షంగా నియమించే ప్రయత్నం చేసినట్టు బయటపడింది.గ్రామ పొదుపు సంఘ సభ్యులతో సమావేశం పెట్టకుండా, నోటీసులు ఇవ్వకుండా, సంబంధిత కమిటీ సభ్యులతో చర్చించకుండా

కొత్త గ్రూపులను సృష్టించడం, బ్యాంకులకు అకౌంట్లు మార్చమని లెటర్లు పంపించడం వంటి చర్యలు కొందరు





అధికారులు స్వచ్ఛందంగా చేపట్టినట్లు సమాచారం.

ఈ విషయాన్ని గమనించిన గ్రామాల స్త్రీశక్తి సంఘ మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి గారిని సంప్రదించారు. వారి విన్నపం వెంటనే స్వీకరించిన ఆయన, మహిళలతో కలిసి గోస్పాడు మండల స్త్రీశక్తి భవన్‌కు చేరుకుని అక్కడ ఉన్న అధికారులను నిలదీశారు.

"ప్రజాస్వామ్యంగా ఎన్నికైన కమిటీలను పక్కనపెట్టి, ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మీటింగ్ కూడా పెట్టకుండా ఇలాంటి మార్పులు ఎలా చేస్తారు?" అంటూ ఆయన అధికారులను గట్టిగా ప్రశ్నించారు.

అధికారులు ఇచ్చిన అస్పష్టమైన సమాధానాలను మాజీ ఎమ్మెల్యే భూమా ఖండించారు.

"ప్రజల స్వాధీన హక్కులను దెబ్బతీసే ఇలాంటి చర్యలను టీడీపీ ప్రభుత్వం సహించదు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నేను ఇక్కడినుంచి వెళ్లను" అని స్పష్టం చేశారు.కేవలం సంఘాల మార్పులు మాత్రమే కాకుండా, ఒకే కార్యాలయంలో ఒకే పోస్టుకు ఇద్దరు అధికారులు విధులు నిర్వహిస్తున్న వ్యవహారం కూడా బయటపడడంతో గోస్పాడు మండలంలో అధికార యంత్రాంగం పనితీరుపై పెద్ద చర్చ మొదలైంది.

ఈ లోపాలన్నింటినీ వెంటనే సరిచేయాలంటూ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు తాను కార్యాలయాన్ని వదిలి వెళ్లబోనని మహిళలకు హామీ ఇచ్చారు.

# ఎర్రచందన అక్రమ రవాణాని అడ్డుకున్న ప్రజలు.!

**స్మగ్లర్ల వాహనాన్ని వెంబడించి పట్టుకున్న అప్పినపల్లి గ్రామస్తులు. -అప్పినపల్లి గ్రామస్తుల ధైర్యాన్ని మెచ్చుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.**

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితోనే స్మగ్లర్లను పట్టుకొన్నామన్న ప్రజలు.**





**ఆంధ్ర ప్రగతి చిత్తూరు నవంబర్ 14:**
ఎర్రచందనం అక్రమ రవాణాపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఆయన అందిస్తున్న భరోసా ప్రజల్లో చైతన్యం నింపుతోంది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో చిత్తూరు జిల్లా, అప్పినపల్లి గ్రామస్తులు ఎర్రచందనం దొంగల ఆటకట్టించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకుని దుంగలను అటవీశాఖ అధికారులకు పట్టించారు. అక్రమంగా రవాణా చేస్తున్న 10 ఎర్రచందనం దుంగలను, ఆ గ్రామ ప్రజల సహకారంతో శుక్రవారం ఉదయం అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ లో సహకరించిన అప్పినపల్లి గ్రామస్తులను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న చర్యలకు తమవంతు సహకారం అందించాలన్న ఉద్దేశంతోనే దుంగల దొంగల వాహనాన్ని వెంబడించినట్టు అప్పినపల్లి గ్రామస్తులు తెలిపారు.

శుక్రవారం ఉదయం తిరుపతి ఫ్లయింగ్ స్క్వాడ్ పులిచర్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక టవెరా వాహనం అనుమానాస్పదంగా దూసుకువెళ్లింది. అటవీ అధికారులు ఆ వాహనాన్ని వెంబడించగా, వారు బెంగళూరు వైపు వేగంగా వెళ్లిపోయారు. మార్గమధ్యంలో వాహనం నుంచి దూకి ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. వాహనంలో ఉన్న డ్రైవర్ వేగంగా నడుపుకొంటూ ముందుకు వెళ్లాడు. అటవీ శాఖ అధికారులు ఇచ్చిన సమాచారంతో చిత్తూరు జిల్లా, అప్పినపల్లి గ్రామస్తులు ఆ వాహనాన్ని వెంబడించారు. దీంతో డ్రైవర్ కూడా వాహనాన్ని ఒక పక్కన ఆపి పారిపోయాడు. అటవీశాఖ అధికారులు, పోలీసులు ఆ వాహనాన్ని తనిఖీ చేయగా అక్రమంగా 10 ఎర్రచందనం దుంగలు దొరికాయి. సమాచారాన్ని అటవీ అధికారులు ఉపముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎర్ర చందనం దొంగల ఆటకట్టించే క్రమంలో గ్రామస్తులు చూపిన చొరవ, ధైర్యాన్ని పవన్ కళ్యాణ్ మెచ్చుకున్నారు. అటవీశాఖ అధికారులు, పోలీసులను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అభినందించారు.

# ప్రపంచ మధుమేహ దినోత్సవ అవగాహన కార్యక్రమం.

**వైద్యాధికారి:ముఖేష్ డాక్టర్- ఆంజనేయులు నాయక్.**



**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ నవంబర్ 14:**
స్థానిక ఆసుపత్రి నందు ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ప్రజలకు మధుమేహ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముఖేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినం జరుపుకుంటామని, ఈ దినోత్సవాన్ని జరుపుకునే ప్రధాన ఉద్దేశ్యం మధుమేహం (డయాబెటిస్) గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించడం
మరియు నివారణ, నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవడంపై దృష్టిపెట్టడం అని తెలిపారు.

ప్రపంచ మధుమేహ దినోత్సవం నవంబర్ 14ను ప్రముఖ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ బాంటింగ్ (కృత్రిమ ఇన్సులిన్‌ను కనుగొన్న వారిలో ఒకరు) పుట్టినరోజుగా గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ( డబ్ల్యూ హెచ్ ఓ ) మరియు అంతర్జాతీయ మధుమేహ సమాఖ్య 1991నుండి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని,2006 నుండి ఇది అధికారికంగా పాటించ బడుతోందని,.మధుమేహం యొక్క ప్రధాన కారణాలు, రకాలు ప్రధానంగా రెండు రకాల డయాబెటిస్ ఉన్నాయి:టైప్ 1 (జన్యుపరంగా వచ్చే రకం) మరియు టైప్ 2 (జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే రకం).ప్రస్తుత జీవనశైలిలో మార్పులు, జీవన ప్రమాణాలు పెరగడం, అధిక బరువు, సరిపడని వ్యాయామం ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.

ప్రముఖుల సూచనలు మరియు నివారణ మార్గాలు మధుమేహం పూర్తిగా నయం చేయలేకపోయినా, దీన్ని నియంత్రించడానికి జీవనశైలిలో మార్పులు, మంచి ఆహారపు అలవాట్లు అవసరమని తెలిపారు. జొన్న రొట్టెలు, పెరుగు, చియా విత్తనాలు, డ్రై ఫ్రూట్స్, తృణధాన్యాలు వంటి ఆహార పదార్థాలు బ్లడ్ షుగర్ నియంత్రణకు సహాయంగా ఉంటాయని తెలిపారు.

డాక్టర్ ఆంజనేయులు నాయక్ మాట్లాడుతూ రోజూ వ్యాయామం చేయడం, బరువును నియంత్రించడం ముఖ్యమైనవని,
ప్రపంచవ్యాప్తంగా మధుమేహ ఉన్న వారు దాదాపు 17% మంది భారతదేశంలో ఉన్నారని. 2019 నాటికి సుమారు 7.7 కోట్లు భారతదేశంలో మధుమేహంతో బాధపడుతుండగా, 2045 నాటికి ఇది 13.4 కోట్లు దాటే అవకాశముందని,
ప్రజల్లో అవగాహన పెంపుదల కొరకు ఈ వ్యాధికి సంబంధించిన అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థలు చేపడుతున్నాయన్నారు.

డయాబెటిస్‌ను నియంత్రించేందుకు ప్రాథమిక నిబంధనలు, ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లు, తగినప్పుడు వైద్య సలహాలు అనుకరణీయంగా ఉంటాయని తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకు నే చర్యలు తీసుకోవడం అవసరం అని తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ అధికారి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ అధిక దాహము ఆకలి ఎక్కువగా ఉండటం అరి కాలి మంటలు తిమ్మిర్లు శరీరం మీద ఫంగల్ ఇన్ఫెక్షన్స్ రావడము అలసట నీరసము శరీరం మీద గాయాలు సరిగా మారకపోవడం తరచూ మూత్ర విసర్జన జననేంద్రియాలపై దురదలు నొప్పులు చూపుమసకబారటం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు.

సరైన ఆహార నియమాలు పాటించడం ఆహారంలో మార్పులు చేసుకోవడం, క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకోవడం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి వాటి ద్వారా కొంతవరకూ మధుమేహం నుండి ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు ,పి హెచ్ ఎన్ సరస్వతి సూపర్వైజర్ రవి కిషోర్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైసిపి సంక్షేమ పాలనకు ప్రజలు మద్దతు ఇవ్వాలి.

**సల్కాపురం గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి**





**ఆంధ్ర ప్రగతి కల్లూరు మండలం నవంబర్ 14:**
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలని కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఇంటింటి దగ్గరకు వెళ్లి ప్రజలందరికీ చేత సంతకాల సేకరణలో పాల్గొని, వైయస్సార్సీపి సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ..ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడు ఇంగ్లీష్ మీడియం చదవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ స్కూలను నాడు నేడు కింద ప్రభుత్వ స్కూలను డెవలప్మెంట్ చేసిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డి ది. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకువస్తే, చంద్రబాబు వాటిని ప్రవేటీకరణ చేయడం దారుణమని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో మీరు ఒక్క రూపాయి కట్టాల్సిన అవసరం లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో మీ భూమిని నమోదు చేసుకుంటే మీకు నష్టం జరిగితే ఎవరి ప్రమేయం లేకుండా డైరెక్ట్ గా మీ అకౌంట్లో వేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డిది పంట నష్టపోయిన వారందరి కూడా ఇన్సూరెన్స్ ఇవ్వడం జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వంలో చూస్తే యూరియా కోసం రోడ్లమీద నిలబడిన పరిస్థితి.. పండిన పంటకు గిట్టుబాటు ధర లేక పండించిన పంటను రోడ్లమీద పోసిన పరిస్థితి ఈ ప్రభుత్వంలో చూస్తున్నాం. తెలుగుదేశం నాయకులు ఎలక్షన్ల ముందర వాగ్దానాలు చేయడం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చే పథకాలతో పాటు సూపర్ సిక్స్ ఇస్తాం అని చెప్పడం జరిగింది. ఈరోజు తెలుగుదేశం నాయకులకు ధైర్యం ఉంటే రైతుల ముందు వచ్చి మాట్లాడండి రైతులు ఆనాడు జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రైతు ఏవిందగా ఉన్నారు.. తెలుగు దేశం ప్రభుత్వంలో రైతుల పరిస్థితి ఏవిదంగా ఉందో తెలుగుదేశం నాయకులు ఒకసారి ఆలోచించండి.సల్కాపురం గ్రామంలో తాగడానికి నీళ్లకి ఇబ్బంది లేకుండా ఆనాడు ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి తో మాట్లాడి మీ గ్రామానికి కోటి ఐదు లక్షలు మీ గ్రామానికి ఇచ్చి త్రాగునీటి కి ఎటువంటి ఇబ్బంది లేకుండా నేను చూడడం జరిగిందనీ తెలుపుతూ వైయస్ జగన్ గారి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని పాణ్యం నియోజకవర్గంలో సైతం ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేయడం ద్వారా జయప్రదం చేయాలని ప్రజలకి పిలుపునిచ్చారు. అనంతరం సల్కాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ కుటుంబాలు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో కాటసానిరాంభూపాల్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు..ఈ కార్యక్రమంలో కల్లూరు మండల నాయకులు, వైయస్ఆర్సీపీ కార్పొరేటర్లు,ఎంపీపీ , ఎంపీటీసీలు, సర్పంచులు, అనుబంధ విభాగాల వివిధ హోదాల్లో ఉన్నవారు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలుర పరిశీలనా వసతి గృహం లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు





**కర్నూలు ఆంధ్ర ప్రగతి నవంబర్ 14:**
కర్నూలు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ( ఆర్.పి.ఎఫ్ ) వారు ప్రభుత్వ బాలుర పరిశీలనా వసతి గృహం మరియు జాయ్ అనాధశ్రమం నందు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్.పి.ఎఫ్. సిఐ వి.రామ్ మోహన్ మాట్లాడుతూ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని సందర్భంగా ఆయన చేసిన సేవల గురించి పిల్లలకు తెలియజేశారు. పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పోటీలు ఏర్పాటు చేయాలని అదేవిధంగా పిల్లలే దేశ భవిష్యత్తు తెలిపారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేక ప్రతిభ ఉండి, క్రమశిక్షణ, కష్టపడి చదవడం, మంచి అలవాట్లు అలవాటు చేసుకుంటే జీవితంలో గొప్ప విజయాలు సాధించవచ్చని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర పరిశీలనా వసతి గృహం సూపరెండెంట్ హుస్సేన్ భాష, డిపిఓ దివాకర్, ఆర్.పి.ఎఫ్. ఏయస్ఐ. డికె ప్రకాశ్, కానిస్టేబుల్ శివ కుమార్, చైల్డ్ హెల్ప్ లైన్ -1098 సిబ్బంది సుంకన్న, జాయ్ అనాధశ్రమం సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం బాలల దినోత్సవ వేడుకలు.

**బాల అకాడమీ పాఠశాలలో నిర్వహణ.**

**బాలల హక్కులపై వ్యాసరచన, వక్తృత్వ పోటీ విజేతలకు బహుమతులు.**


**ఆకట్టుకున్న బాల అకాడమీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు.**

**బాలలు దేశభక్తులుగా ఎదగాలి: డాక్టర్ రవికృష్ణ.**

**బాలల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం: నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 14:**
శుక్రవారం భారత ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు బాల అకాడమీ పాఠశాల, నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం సంయుక్తంగా బాల అకాడమీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ మాధవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యురాలు డాక్టర్ నాగమణి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ రాష్ట్ర మహిళా వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ సౌజన్య, ఐఎంఏ నంద్యాల మహిళా వైద్య విభాగం కార్యదర్శులు డాక్టర్ సునీత, డాక్టర్ శైలజలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా బాల అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ బాలల సృజనాత్మక శక్తులను ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ,పాఠశాల యాజమాన్యాలపై,అధ్యాపకులపై ఉన్నదని గుర్తు చేశారు. బాలలు గొప్ప జీవిత లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధన కోసం పట్టుదలతో, అంకితభావంతో, సమయపాలన పాటిస్తూ, నిరంతర కృషి చేసి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ ఐఎంఏ నంద్యాల మహిళా వైద్య విభాగం ఆధ్వర్యంలో పాఠశాలలలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. డాక్టర్ లక్ష్మీ సౌజన్య మాట్లాడుతూ బాలలు చదువుతోపాటు క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం అవసరమన్నారు. డాక్టర్ సునీత మాట్లాడుతూ బాలలు క్రమశిక్షణతో మెలుగుతూ, తోటివారిపట్ల స్నేహభావం కలిగి అవసరమైనప్పుడు సహాయం చేసే గుణం అలవర్చుకోవాలన్నారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ ఫోన్ గేమ్స్ కు, హానికరమైన చిరు తిండ్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించాలని కోరారు. బాలల దినోత్సవం



పురస్కరించుకుని బాలల హక్కులపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీ విజేతలకు నంద్యాల ఐఎంఏ మహిళా వైద్య విభాగం తరపున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల అకాడమీ పాఠశాల విద్యార్థులు,అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# మోదీ, నితీశ్‌పై ప్రజల నమ్మకానికి నిదర్శనమన్న పవన్

**మోదీకి పెరుగుతున్న ప్రజాదరణకు ఇది సంకేతమన్న సత్యకుమార్**

**ఆంధ్ర ప్రగతి నవంబర్ 14:**




దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి విజయం దిశగా దూసుకెళు తుండటంపై ఆంధ్రప్రదేశ్ నుంచి స్పందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎన్డీఏ కూటమికి అభినందనలు తెలుపుతూ, ఇది ప్రధాని మోదీ నాయకత్వానికి లభించిన మద్దతుగా అభివర్ణించారు.పవన్ కల్యాణ్ స్పందిస్తూ... బీహార్ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వంపై మరోసారి తమ విశ్వాసాన్ని చాటారని అన్నారు. అభివృద్ధి, పారదర్శక పాలనకే ప్రజలు పట్టం కట్టారని, ఈ అపూర్వ తీర్పు దేశం ఎలాంటి పాలన కోరుకుంటోందో స్పష్టం చేస్తోందని పేర్కొన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలన్నింటికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.మరోవైపు, మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ ఫలితాలు దేశ రాజకీయ గతిని సూచిస్తున్నాయని తెలిపారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ప్రజలు బలమైన మద్దతు ప్రకటించారని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగానే బీహార్‌లోనూ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వానికి ప్రజలు ఓటు వేశారని ఆయన గుర్తుచేశారు.

# మహానందీశ్వర స్వామి దేవస్థానంలో లక్ష బిల్వార్చన..!




...18 న మాసశివరాత్రిని పురస్కరించుకొని లక్ష బిల్వార్చన కార్యక్రమం.

...భక్తులకు అన్నదానం మరియు గ్రామోత్సవం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 14:** పరమపవిత్రమైన కార్తీక్ మాసంలో శివాలయాల సందర్శన ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. నంద్యాల నవ నందులకు నిలయం.కార్తీకమాసంలో భక్తులు దూర ప్రాంతాల నుంచి నవ నందులు ర్శించుకుంటారు.వేకువజామునే పుణ్య స్నానాలు ఆచరిస్తారు.శివ నామస్మరణలతో శివాలయాలు మారుమ్రోగుతాయి.కార్తీక మాసంలో పరమ పవిత్రమైన రోజుగా మాస శివరాత్రిని జరుపుకుంటారు. నంద్యాలలో నవ నందులు దర్శించుకున్న వారు తప్పనిసరిగా కోట వీధిలో వెలిసిన బ్రహ్మ నందీశ్వర స్వామి,మహా నందీశ్వర స్వామి దేవస్థానాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుంది.నవ మందులతో పాటు శ్రీశైలం,యాగంటి,మహానంది దేవాలయాల్లో దర్శించుకునే భక్తులు తప్పనిసరిగా ఒక్క స్వామివార్ల కు పూజలు నిర్వహిస్తారు.ఈ నెల 18 మాస శివరాత్రి సందర్భంగా దేవాలయంలోని ప్రార్ధన అర్చకులు రాచకొండ మురళీ కృష్ణ శర్మ,కృష్ణ గిరి సురేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.వేకువజామున రుద్రాభిషేకం, స్వామి వారికి లక్ష బిల్వార్చన, అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు.పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదాన వితరణ నిర్వహిస్తున్నారు.సాయంత్రం స్వామి వాళ్లను గ్రామోత్సవం కన్నుల పండుగగా జరుగుతుంది.దేవాలయంలో ఉదయం నుంచి రాత్రివరకు విశేష పూజలు నిర్వహిస్తారు.దేవాలయాన్ని అంగ,రంగ సుందరంగా విద్యుత్ దీపాల వెలుగుల్లో కనువిందు చేస్తాయి.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తారు.









# అరుణాసురుని సంహరించి వెలసిన భ్రమరాంబిక.!

## శ్రీశైలం ఎలా మోక్షధామంగా మారిందో తెలుసా.?

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 14:** పరమ పవిత్రమైన ఈ కార్తిక మాసంలో కేవలం దర్శించినంత మాత్రాన్నే మోక్షాన్ని ప్రసాదించే శ్రీశైల క్షేత్రం- మనసులో స్మరించినా చాలు దర్శనఫలం లభిస్తుందని విశ్వాసం!
ద్వాదశ జ్యోతిర్లింగాల్లో రెండో జ్యోతిర్లింగమైన 'శ్రీశైలం' భువిలో వెలసిన కైలాసంగా ఖ్యాతి పొందింది. దర్శించినంత మాత్రాన్నే మోక్ష ప్రాప్తిని కలిగించే శ్రీశైల క్షేత్రంలో పరమ శివుడు మల్లిఖార్జున స్వామిగా, పార్వతి భ్రమరాంబికగా వెలసి ఉన్నారు. కార్తీక మాసం సందర్భంగా ద్వాదశ జ్యోతిర్లింగాలలో రెండోదైన శ్రీశైల క్షేత్ర విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

### శ్రీశైలం ఎక్కడుంది?
ఆంధ్రప్రదేశ్ కర్నూలు జిల్లాలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీశైల క్షేత్రం శివ భక్తులకు మోక్షధామం. కేవలం స్మరించినంత మాత్రాన్నే మోక్షాన్ని పొందగలిగే అద్భుత క్షేత్రం శ్రీశైలం. శ్రీశైలం క్షేత్రాన్ని ఒక్కసారి దర్శిస్తే గంగా నదిలో రెండు వేల సార్లు మునిగిన పుణ్యం, కాశీ క్షేత్రంలో లక్షలాది సంవత్సరాలు నివసిస్తే కలిగేంత పుణ్యం లభిస్తుందని శాస్త్రవచనం.

### ఆలయ స్థల పురాణం
పూర్వం అరుణాసురుడు అనే రాక్షసుడు చాలా కాలం పాటు గాయత్రీ మంత్రం జపిస్తూ బ్రహ్మ కోసం తపస్సు చేసి, రెండు కాళ్ల, నాలుగు కాళ్ల ప్రాణులచే మరణం లేకుండా వరం పొందాడు. వరం ప్రభావంతో అరుణాసురుడు చేయని ఆగడాలు లేవు. ఆ రాక్షసుని ఆగడాలకు భయపడిన దేవతలు ఆదిశక్తిని ప్రార్థించారు.

### గాయత్రీ ప్రభావమే రక్షణ
అమ్మవారు ప్రత్యక్షమై అరుణాసురుడు తన భక్తుడని గాయత్రీ మంత్రం జపిస్తున్నంత వరకు అతన్ని ఎవరూ ఏమీ చేయలేరని చెబుతుంది. తర్వాత దేవతలు దేవగురువు బృహస్పతిని అరుణాసురుని దగ్గరికి పంపిస్తారు. అరుణాసురుడు దేవ గురువు బృహస్పతి రాకకు ఆశ్చర్యపోగా, బృహస్పతి అరుణాసురునితో "మనమిద్దరం ఒకే అమ్మవారిని గాయత్రీ మంత్రంతో పూజ చేస్తున్నామని, కాబట్టి నా రాకలో వింత ఏమి లేదని" చెపుతాడు. అందుకు అరుణాసురుడు దేవతలు పూజ చేసే అమ్మవారిని నేను ఎందుకు పూజ చేయాలని అహంకరించి గాయత్రి మంత్రం జపాన్ని మానేస్తాడు. దానికి కోపించిన ఆదిశక్తి భ్రమర రూపం ధరించి అసంఖ్యాకంగా భ్రమరాలని సృష్టిస్తుంది. ఆ భ్రమరాలు అరుణాసురుడిని అతని సైన్యాన్ని సంహరిస్తాయి. ఆ విధంగా అరుణాసురునికి ఆరు కాళ్ల ప్రాణిచే మరణం సంభవిస్తుంది. అతడు పొందిన వరం ఇక్కడ పనికిరాకుండా పోతుంది.



### శ్రీశైలంలో శివుని మల్లికార్జునుడని ఎందుకు పిలుస్తారు?
శ్రీశైల క్షేత్రంలో శివుని మల్లిఖార్జునుడని పూజించడం వెనుక ఓ కథనం ఉంది. కృష్ణానది తీరంలో మల్లికాపుర మహారాజగు చంద్రకేతుడు సంతానం కోసం పరితపిస్తుండగా ఆ రాజుకు లేక లేక ఓ అమ్మాయి జన్మించింది. ఆమెకు చంద్రమతి అని నామకరణం చేశారు. ఆమె పుట్టిన తర్వాత రాజ పురోహితులు చంద్రకేతుని జైత్రయాత్ర ముహూర్తం పెట్టారు. చంద్రకేతుడు జైత్రయాత్రను మొదలుపెట్టి రాజ్య విస్తరణ కాంక్షతో కొన్నేళ్లపాటు అలా కొనసాగిస్తూనే ఉన్నాడు. అలా కొన్నేళ్లు గడిచిన తర్వాత చంద్రకేతుడు జైత్రయాత్ర ముగించి, తిరిగి మల్లికాపురానికి చేరుకున్నాడు.

### కూతురుపై చంద్రకేతుని దాష్టీకం
రాజ్యానికి తిరిగి వచ్చిన చంద్రకేతు తన అంతఃపురంలో తిరుగుతున్న అందమైన కన్యను చూసి మోహించాడు. ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని ఆమె వెంటపడ్డాడు. అది చూసిన అతని భార్య ఆమె మరెవరో కాదు, మీ కూతురు చంద్రమతి అని చెప్పినా చంద్రకేతుడు పట్టించుకోలేదు. చంద్రమతి చేతులు జోడించి 'నేను మీ కుమార్తెను. వదిలిపెట్టండి' అని వేడుకున్నా, చంద్రకేతుడు కామకాంక్షతో ఆమెను లోబరుచుకోడానికి ప్రయత్నించాడు.

### జంగమయ్యను శరణు వేడిన చంద్రమతి
తండ్రి నుంచి తప్పించుకునే ప్రయత్నంలో చంద్రమతి బ్రహ్మగిరిని వదిలి కృష్ణా నది దాటి కొండల్లోకి పరుగు తీసింది. అక్కడ ఓ గుహలో తలదాచుకుంది. దీంతో ఆమె కోసం చంద్రకేతుడు ఆ గుహ బయటే మాటువేశాడు. శివ భక్తురాలైన చంద్రమతి మరో దారి లేక తండ్రి నుంచి తనను కాపాడాలని శివుడిని మల్లెపూలతో పూజించింది.

### పాతాళగంగ పచ్చగా ఇందుకే!
చంద్రమతి మొరాలకించిన శివుడు చంద్రకేతుడిని ఆకుపచ్చ శిలగా మార్చేశాడు. ఆ శిల దొర్లుకుంటూ పాతాళగంగలో పడింది. అందువల్లే అక్కడి నీరు పచ్చగా ఉంటుందని భక్తులు నమ్ముతారు. అనంతరం శివుడు మల్లికాపురమును నిర్మూలిస్తాడు. ఆనాటి నుంచి శివునికి మల్లిఖార్జునుడనే నామధేయం ఏర్పడిందని ఆలయ స్థల పురాణం ద్వారా మనకు తెలుస్తోంది.

### ఆలయ విశేషాలు
శ్రీమల్లికార్జునుని దేవాలయంలో మల్లికార్జున స్వామి జ్యోతిర్లింగంగా పూజలందుకుంటున్నాడు. నాలుగు మండపములతో అపూర్వమైన శిల్ప సంపదతో అలరారే అందమైన దేవాలయము శ్రీశైలం. శ్రీశైలంలో మల్లిఖార్జునుని ఆలయంతో పాటుగా మరెన్నో దర్శనీయ స్థలాలు కలవు. అవేమిటో చూద్దాం.

### శక్తి పీఠం కూడా
శ్రీశైలం అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటిగా భాసిల్లుతోంది. ఇక్కడ వెలసిన అమ్మవారు భ్రమరాంబికా దేవి. ఈ దేవాలయంలో గర్భాలయ వెనుక భాగమున గోడకు చెవి ఆన్చి వింటే ఝుమ్మనే భ్రమర నాదం వినిపించడం ఇక్కడి ప్రత్యేకత.

### సాక్ష్యమిచ్చే సాక్షి గణపతి
శ్రీశైలానికి 3 కిమీల దూరంలో ఉన్న సాక్షి గణపతి ఆలయం కూడా తప్పకుండా సందర్శించాల్సిన ప్రాంతం. ఇక్కడ గణపతిని దర్శిస్తే స్వామి శివునికి ఫలానా భక్తుడు శ్రీశైలానికి వచ్చాడని సాక్ష్యం చెబుతాడట! లేకుంటే మనం శ్రీశైలం వెళ్లిన దర్శన ఫలం దక్కదని విశ్వాసం.

### మనోహర గుండం
శ్రీశైలంలో తప్పకుండా చూడవలసిన వాటిలో ఇది ఒకటి. దీనిలో గొప్పతనం ఏమిటంటే చాలా స్వచ్ఛమైన నీరు ఈ గుండములో ఉంటుంది.

### పంచ పాండవుల దేవాలయాలు
పాండవులు మల్లికార్జునుని దర్శించుకొని వారి పేరున అయిదు దేవాలయాలను ప్రధాన దేవాలయ వెనుక భాగమున నిర్మించి శివలింగములను ప్రతిష్ఠించిరి. శ్రీశైలం వెళ్లిన వారు ఈ పంచపాండవులు ఆలయాలను కూడా తప్పకుండా దర్శించుకోవాలి.

### వృద్ధ మల్లికార్జున లింగం
శ్రీశైలం ఆలయంలోని వృద్ధ మల్లికార్జున లింగం ముడతలు పడిన ముఖంలా ఉన్న శివ లింగం. దీనిని కూడా తప్పకుండా దర్శించుకోవాలి.

### పాతాళ గంగ
పాతాళ గంగ వద్ద నీరు నీలంగా కాక పచ్చగా ఉంటుంది. నీటి క్రింద బండలపై నాచు నిలచి సూర్య కిరణాల వెలుగు వల్ల పచ్చగా కానవస్తుంది. అయితే అందరూ నీటి క్రింద గల దీన్ని పచ్చల బండ అని వ్యవహరిస్తారు.

### జన్మరాహిత్యం శ్రీశైల శిఖర దర్శనం
శ్రీశైల క్షేత్ర దర్శనంలో అత్యంత ప్రత్యేకమైనది, ఈ శ్రీశైల శిఖరం. శ్రీశైల శిఖర దర్శనం చేసుకుంటే పునర్జన్మ ఉండదని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ఈ ప్రాంతం నుంచి దూరంగా ఉన్న ఆలయ శిఖరాన్ని దర్శనం చేయగలిగితే పునర్జన్మ ఉండదని, జన్మరాహిత్యం కలుగుతుందని భక్తుల నమ్మకం.
పాలధార, పంచధారలు
సాక్షి గణపతి గుడికి మధ్యగా హటకేశ్వరానికి సమీపాన అందమైన లోయలో ప్రశాంత ప్రదేశంలో జగద్గురు శంకరాచార్య తపమాచరించిన ప్రదేశం ఉంది. ఇక్కడ శిలపై శంకరుని పాదముద్రలు ఉన్నాయి. ఈ కొండ పగుళ్ల నుంచి పంచధారలతో ఉరికివచ్చే జలాలు చల్లగా ఏ కాలంలోనైనా ఒకే మాదిరిగా ప్రవహిస్తూ ఒక్కొక్క ధార ఒక్కొక్క రుచితో ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఒక ధార నుంచి నీరు త్రాగి, ఇంకో ధార నుంచి నీరు త్రాగితే రుచిలో మార్పు తెలుస్తుంది.

### హటకేశ్వరం
శ్రీశైలమల్లికార్జునదేవస్థానమునకు మూడు కిలోమీటర్ల దూరంలో కల మరొక పుణ్యక్షేత్రం హటకేశ్వరం. ఇక్కడ పరమశివుడు అటిక అంటే ఉట్టి, కుండ పెంకులో వెలియడంతో ఈ ఆలయంలోని ఈశ్వరుని అటికేశ్వరుడు అనేవారు రానురాను అదే మెల్లగా హటి కేశ్వర స్వామిగా మారిపోయింది.

### ఇష్టకామేశ్వరీ క్షేత్రం
నల్లమల అడవుల్లో ఉన్న ఇష్ట కామేశ్వరి ఆలయం గురించి అతి కొద్దిమందికి మాత్రమే తెలుసు. మహిమాన్వితమైన ఇష్టకామేశ్వరి దేవి పేరుతో శ్రీశైల క్షేత్రంలో తప్ప దేశంలో మరెక్కడా ఇలాంటి ఆలయం కనిపించదు. ఇక్కడ అమ్మవారి నుదురు తాకితే మెత్తగా మనిషి నుదురు లాగా ఉంటుంది. ఎంతో అదృష్టం ఉంటే తప్ప అమ్మవారి దర్శనం చేసుకోలేమని భక్తుల విశ్వాసం.

### పూజోత్సవాలు
శ్రీశైలంలో ప్రతి నిత్యం లక్షలాది మంది భక్తులతో సందడిగా ఉంటుంది. ముఖ్యంగా కార్తికమాసం, మహాశివరాత్రి సమయంలో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. శరన్నవరాత్రి ఉత్సవాలు కూడా ఎంతో వైభవంగా జరుగుతాయి. మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రతిరోజూ త్రికాల పూజలు, అభిషేకాలు, స్పర్శ దర్శనం, ధూళి దర్శనం వంటి పూజలతో శ్రీశైలం నిత్యకల్యాణం పచ్చతోరణం అన్నట్లుగా ఉంటుంది. అంతేకాదు తిరుమల ఆలయంలో మాదిరిగానే ఇక్కడ కూడా ప్రతిరోజూ కళ్యాణం జరుగుతుంది. అయితే శ్రీశైలంలో శివపార్వతుల కళ్యాణం సాయంత్రం జరగడం విశేషం. పరమ పవిత్రమైన ఈ కార్తిక మాసంలో కేవలం దర్శించినంత మాత్రాన్నే మోక్షాన్ని ప్రసాదించే శ్రీశైల క్షేత్రాన్ని, మనసులో స్మరించినా చాలు దర్శనఫలం లభిస్తుందని విశ్వాసం.

# బీహార్ ఫలితాలతో కాంగ్రెస్ ఖేల్ ఖతం

### వరుస పరాజయాలు మూటకట్టుకున్న పార్టీ

### బీహార్‌లో ఓట్ చోరీ పేరుతో నానాయాగీ చేసిన రాహుల్

### ఫలితాల వెల్లడితో రాహుల్ ..ఎకడ అంటూ నెటిజన్ల ప్రశ్న



న్యూఢిల్లీ,,**నవంబర్14ఆంధ్ర ప్రగతి**
బీహార్ ఫలితాలు చూశాక...దేశంలో కాంగ్రెస్ పార్టీ పని కంచికే అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఇటీవలే జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం పార్టీ వరుస పరాజయాలు మూటగట్టుకున్న విషయం తెలిసిందే. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైంది. ఇప్పుడు మరో రాష్ట్రం బీహార్‌లోనూ హస్తం పార్టీకి అదే పరిస్థితి ఎదురైంది. అక్కడ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేల్చిన హైడ్రోజన్ బాంబు పనిచేయలేదు. భారీగా ఓట్ల చోరీ జరిగిందంటూ రాహుల్ ఆరోపిస్తూ వచ్చిన రాహుల్ బిజెపిని దోషిగా నిలబెట్టాలని చూశారు. బిజెపి దొంగోట్లతో గెలిచిందని ఆరోపించారు. నిజంగానే ఇది ఓ రకంగా ఓటర్లను అవామనించిట్లుగానే భావించాలి. ఇది కూడా బీహార్‌లో బలంగా పనిచేసిందని చెప్పుకోవచ్చు. ఇందులో భాగంగానే బీహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాల సవరణ ఎస్ఐఆర్ను వ్యతిరేకిస్తూ జరిపిన 'ఓట్ అధికార్ యాత్ర' పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో ఆర్జేడీతో కలిసి పోటీ చేసిన కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదు. కాంగ్రెస్, ఆర్జేడీతో కూడిన ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమికి బీహార్ ఓటర్లు గట్టి షాకిచ్చారు. అక్కడ ఎన్డీయే కూటమి అంచనాలకు మించి దూసుకెళ్లింది. ఇప్పటికే ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 122 స్థానాలను దాటి 190 స్థానాల్లో ముందంజలో ఉంది. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కేవలం 48 స్థానాలకే పరిమితమైంది. ఈ నేపథ్యంలో రాహుల్‌ను లక్ష్యంగా చేసుకొని నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా ట్రోలింగ్‌కు ఎక్కుపెట్టారు. 'రాహుల్ గాంధీ ఎక్కడ..?' అంటూ ప్రశ్నిస్తున్నారు. 'ఓట్ చోరీ అంటూ తిరిగిన రాహుల్.. ఇప్పుడు ఎక్కడా కనిపించట్లేదు' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'రాహుల్ ఎక్కడికి వెళ్లారు.. తేజస్విని పూర్తిగా ముంచేసి సెలవుపై వెళ్లినట్లున్నారు. బీహార్ సీఎం మళ్లీ నితీశే' అంటూ రాహుల్‌ని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టులు వైరల్ అవుతున్నాయి. తాజా ఫలితాల ప్రకారం బీహార్‌లో ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్‌కు ఘోర పరాభవం ఎదురైంది. అధికార జేడీ(యూ), బీజేపీ పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమిని దించి ఈసారి ఎలాగైనా అధికారం చేపడదామని కలలు కన్న కాంగ్రెస్, ఆర్జేడీకి బీహార్ ఓటర్లు గట్టి షాకిచ్చారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేల్చిన హైడ్రోజన్ బాంబు పనిచేయలేదు. బీహార్‌లో సమగ్ర ఓటర్ల జాబితాల సవరణ ను వ్యతిరేకిస్తూ జరిపిన 'ఓట్ అధికార్ యాత్ర' పెద్దగా ప్రభావం చూపలేదు. బీహారీలు మళ్లీ ఎన్డీయేకే జై కొట్టారు. కూటమి ఆధిక్యంలో మ్యాజిక్ ఫిగర్ 122ను దాటి 191 స్థానాల్లో జోరు ప్రదర్శిస్తోంది. ఈ ఎన్నికల్లో విజయం తమదే అంటూ చెప్పుకుంటున్న ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్.. ఫలితాల్లో హాఫ్ సెంచరీని కూడా చేరుకోలేకపోవడం గమనార్హం. 47 స్థానాల్లో మాత్రమే ముందంజలో కొనసాగుతోంది. 2020 ఎన్నికల్లో ప్రతిపక్షపార్టీ ఏకంగా 114 స్థానాల్లో గెలుపొందిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఎన్నికల్లో అందులో సగం స్థానాలను కూడా దక్కించుకోలేక పోవడం గమనార్హం.
ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నుంచి సీఎం అభ్యర్థిగా ఉన్న తేజస్వీ యాదవ్ కూడా తాజా ఫలితాల్లో వెనుకంజలో ఉండటం ఆ పార్టీకి గట్టి షాకే అని చెప్పాలి. ఈ ఎన్నికల్లో తేజస్వీ నేతృత్వంలోని ఆర్జేడీ 143 స్థానాల్లో పోటీ చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ 61 స్థానాల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంది.

# బీహార్‌లో అడ్రస్ లేని ప్రశాంత్ కిశోర్

### వ్యూహకర్తకే షాకిచ్చిన సొంత రాష్ట్రం



పాట్నా, **నవంబర్14ఆంధ్ర ప్రగతి** పీకే అంటే ప్రశాంత్ కిషోర్.. పేరు తెలియని వారు దేశంలో ఉండరేమో. ఎక్కడ ఎన్నికలు వచ్చినా పలు పార్టీలు ప్రశాంత్ కిషోర్ తో టచ్‌లోకి వెళ్లిపోతాయి. ఎన్నో పార్టీలకు ఎన్నికల వ్యూహకర్తగా వ్యవహరించి వారి గెలుపులో కీలక పాత్ర పోషించారు ప్రశాంత్ కిషోర్. సర్వేలు, సూచనలు, తనదైన వ్యూహాలతో పలు పార్టీల విజయాల్లో కీలకంగా వ్యవహరించారు. అయితే, తాజాగా సొంతింట్లోనే ఆయన ఎన్నికల వ్యూహం పనిచేయకపోవడం గమనార్హం. ఎన్నికల వ్యూహకర్త సేవలకు స్వస్తి పలికిన ప్రశాంత్ కిషోర్ ఇటీవలే ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. జన్ సురాజ్ పార్టీ ని స్థాపించారు. తొలిసారి స్వరాష్ట్రం బీహార్ ఎన్నికల్లో తన అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. మొత్తం అన్ని స్థానాల్లో తన పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపారు. అధికార, విపక్షాల కంటే ముందుగానే అభ్యర్థుల జాబితా ప్రకటించారు. వెనుకబడిన తరగతులు, ముస్లిం, షెడ్యూల్ కులాల వారికి ప్రాధాన్యం కల్పించారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం, ఎలాంటి నేర చరిత్రలేని కొత్త ముఖాలనూ పోటీలో నిలబెట్టారు. అయితే, అక్కడ ఆయన పార్టీ పెద్దగా ప్రభావం చూపలేదు సరికదా సింగిల్ డిజిట్ కూడా అనుమానంగానే ఉంది. బీహార్‌లో పీకే ఎన్నికల వ్యూహం ఫెయిల్ అయ్యింది. జన్‌సురాజ్ పార్టీ కనీసం ఖాతా కూడా తెరవకపోవడం గమనార్హం. శుక్రవారం ఉదయం ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కాగానే పోస్టల్ కౌంటింగ్‌లో రెండు స్థానాల్లో ముందంజలో ఉండగా.. ఇప్పుడు అది కూడా లేదు. ప్రస్తుతం 'జీరో' స్థానంలో జన్ సురాజ్ పార్టీ కొనసాగుతోంది. బీహార్‌లో అధికారమే లక్ష్యంగా తాము బరిలో దిగుతున్నామని ప్రచార సమయంలో పీకే ఊదరగొట్టారు. ఈ ఎన్నికల్లో 243 స్థానాలకుగాను 150 స్థానాలు గెలువాలన్నది తమ టా÷-గ్గ÷ట్ అన్నారు. 150 స్థానాలకు ఒక్క స్థానం తగ్గినా తాము ఓడినట్లుగానే పరిగణిస్తామని ధీమా వ్యక్తంచేశారు. తమ పార్టీ నుంచి గొప్పగొప్ప వ్యక్తులను బరిలో దించినట్లు చెప్పారు. అయితే, చివరికి ఒక్కస్థానాన్ని కూడా కైవం చేసుకోలేదు. ఇక ఈ ఎన్నికల్లో పీకే ఎక్కడ పోటీ కూడా చేయలేదు. పార్టీ ప్రయోజనాల కోసమే తానీ నిర్ణయం తీసుకున్నట్టు పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. మరోవైపు ఎగ్జిట్‌పోల్స్ కూడా జన్ సురాజ్ పార్టీ ఖాతా తెరిచే అవకాశం లేదని తేల్చిన విషయం తెలిసిందే. కాగా, మొత్తం 243 స్థానాలున్న బీహార్ అసెంబ్లీకి రెండు విడతల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. నవంబర్ 6వ తేదీన తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్ నిర్వహించారు.


# నియోజకవర్గం ప్రజల వెన్నంటే ఉంటా

### విజయం అందించిన ప్రజలకు నవీన్ కృతజ్ఞతలు

హైదరాబాద్, **నవంబర్14ఆంధ్ర ప్రగతి** నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల నమ్మకాన్ని వమ్ము చేయనని జూబ్లీహిల్స్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం నవీన్ యాదవ్ శుక్రవారం యూసుఫ్‌గూడలో విలేకర్లతో మాట్లాడుతూ.. అధిక బ్జడెట్ తీసుకువచ్చి.. జూబ్లీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేస్తానని నియోజకవర్గ ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. భారీ మెజార్టీతో తనను జూబ్లీహిల్స్ ప్రజలు గెలిపించారన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలుపించినందుకు ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు పాదాభివందనం చేస్తున్నట్లు చెప్పారు. ఎంతో కష్టపడి జూబ్లీహిల్స్ కార్యకర్తలు తనను గెలిపించుకున్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధే తన ఎజెండా అని పేర్కొన్నారు. అయితే గతంలో బీఆర్ఎస్ పార్టీ గెలిచిన సమయంలో కక్ష పూరిత రాజకీయాలు చేశారని గుర్తు చేశారు. కానీ తాను అలాంటి రాజకీయాలు చెయ్యనన్నారు. అందరితో కలుపుకొని వెళ్లి.. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. మన ప్రాంత సమస్యలు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. తనను, తన కుటుంబం వ్యక్తిత్వాన్ని దెబ్బతీస్తూ ఓట్లు అడిగారని.. అందుకు జూబ్లీహిల్స్ ప్రజలు గట్టిగా సమాధానం ఇచ్చారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయంపై బీఆర్ఎస్ చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా ఆయన ఖండించారు. రిగ్గింగ్, దౌర్జన్యం అనేవి తప్పుడు మాటలని నవీన్ యాదవ్ వ్యాఖ్యానించారు. మరోవైపు.. ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించడంపై బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత మండిపడ్డారు. అధికార కాంగ్రెస్ దౌర్జన్యాలు, రిగ్గింగ్ వల్లే ఆ పార్టీ అభ్యర్థికి ఈ విజయం సొంతమైందంటూ విమర్శించింది. ఈ నేపథ్యంలో నవీన్ యాదవ్ పై విధంగా స్పందించారు.

# ఉగ్రవాదులకు గట్టి హెచ్చరిక

### ఢిల్లీ బాంబర్ ఉమర్ ఇల్లు పేల్చివేత




శ్రీనగర్, **నవంబర్14ఆంధ్ర ప్రగతి**ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుడుకు కారణమైన ముష్కరుడు డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని భద్రతా బలగాలు పేల్చి వేశాయి. దేశద్రోహానికి పాల్పడ్డ ఈ దుండగుడి ఇంటిని పేల్చేయడం ద్వారా గట్టి సమాధానం ఇవ్వాలని, గట్టి సందేశం ఇవ్వాలని నిర్ణయించారు. ఢిల్లీ పేలుడు ఘటన దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోన్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎర్రకోట వద్ద పేలుడు చోటుచేసుకున్న కారును నడిపిన ప్రధాన నిందితుడు డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని భద్రతా దళాలు పేల్చివేశాయి. జమ్మూకశ్మీర్ పుల్వామాలోని అతడి ఇంటి వద్ద గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ కూల్చివేత పక్రియను చేపట్టినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దిల్లీ పేలుడుపై కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఉమర్ ఇంటిని ధ్వంసం చేసినట్లు తెలిపాయి. సోమవారం ఎర్రకోట వద్ద జరిగిన పేలుడులో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. హ్యుందాయ్ ఐ20 కారు కారణంగానే ఈ పేలుడు జరిగిందని అధికారులు గుర్తించారు. పలు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా దీన్ని డాక్టర్ ఉమర్ నబీ నడిపినట్లు కనుగొన్నారు. కారులో దొరికిన ఆనవాళ్లను అతడి కుటుంబసభ్యుల డీఎన్ఏతో పరీక్షించగా.. కారు నడిపింది ఉమరే అని తేల్చారు. ఈ పేలుడులో అతడు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు నిర్ధరించారు. హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేదిస్తున్న క్రమంలో ఈ పేలుడు ఘటన చోటుచేసుకుంది. నిందితుడు ఉమర్‌కు ఈ మాడ్యూల్‌తో సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్ వెనుక ఎవరున్నారనే దానిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# అభివృద్ధి, సంక్షేమంలో బాబు రోల్ మోడల్

### హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటి కేంద్రంగా తీర్చి దిద్దారు

### మోడీ నేతృత్వంలో అర్థికాభివృద్ధి భారత్ దూకుడు

### విశాఖ సిఐఐ సదస్సులో ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్



విశాఖపట్నం, **నవంబర్14ఆంధ్ర ప్రగతి** అభివృద్ధి, సంక్షేమానికి సీఎం చంద్రబాబు నాయుడు రోల్ మోడల్ అని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారురు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దారన్నారు .30వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోందన్నారు. సంపద సృష్టిస్తేనే ప్రపంచంలో పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందన్నారు. ఏపీలో సుపరిపాలన, అత్యుత్తమ విధానాలనే సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఆచరిస్తోందని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏపీని అభివృద్ధి చేయడానికి అంతే శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు సాధించడానికి చంద్రబాబు.. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను ఒప్పిస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. దేశం, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేస్తున్నాయన్నారు. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధి దోహదం చేస్తున్నాయని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్లూ, అగ్రి ఎకనామి ఇలా వేర్వేరు రంగాల్లో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు ఏపీలో ఉన్నాయని ఉపరాష్ట్రపతి వెల్లడించారు.
గవర్నెన్సు, డిజిటల్ ఇన్ ఫ్రా ద్వారా వేగంగా సేవలు అందుతున్నాయన్నారు. టెక్నాలజీ నాలెడ్జి డ్రివెన్ ఎకానమీ సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోనూ, ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయం అంటూ ఉపరాష్ట్రపతి అందరికీ పిలుపునిచ్చారు. వచ్చే రెండు మూడేళ్లలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుందన్నారు. అలాగే అతిపెద్ద స్టార్టప్ ఎకో సిస్టంగానూ భారత్ ఎదుగుతుందని పేర్కొన్నారు. 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ప్రతీ దేశంతోనూ భారత్ మైత్రినే కోరుకుంటుందని.. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిది అని అన్నారు. ఇతరులకు నష్టం కలిగించటం కాదు, ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదమని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

# పవన్ దూకుడు.. ఫలితం త్వరలోనే..!

**నవంబర్14ఆంధ్ర ప్రగతి**
ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. పలు అంశాలపై నిశితంగా దృష్టి పెడుతున్నారు. తన శాఖలకు సంబంధించే కాకుండా.. తన పార్టీకి చెందిన కందుల దుర్గేష్, నాదెండ్ల మనోహర్ శాఖలకు సంబంధించి కూడా ఆయన పర్యవేక్షణ చేస్తున్నారు. ఆయా శాఖల్లో జరుగుతున్న పరిణామాలు.. వెలుగు చూస్తున్న అక్రమాలపై పవన్ ఓ కన్నేస్తున్నారు. ఈ క్రమంలోనే బియ్యం అక్రమ రవాణా సహా.. అటవీ సంపద అక్ర మాలు.. పంచాయతీ నిధులు వంటివాటిపై దృష్టి పెట్టారు. గతంలో బియ్యం అక్రమ రవాణాపై పవన్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ముఖ్యంగా కాకినాడ పోర్టు నుంచి రేషన్ బియ్యం తరలి పోకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అదేసమయంలో రేషన్ మాఫియా పై ఉక్కుపాదం మోపుతున్నట్టు కూడా



ప్రకటించారు. ఇక, ఇప్పుడు అటవీ సంపద, భూములు, ముఖ్యంగా ఎర్రచందనం వంటి వాటిని సీరియస్‌గా తీసుకున్నారు. అయితే.. ఇక్కడే పలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. పవన్ ఇప్పటి వరకు ఆగ్రవేశాలు ప్రదర్శించినా.. వాటి లో రిజల్ట్ మాత్రం కనిపించలేదు. ఇప్పుడు జరుగుతున్న చర్చ. తాజాగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కార్నర్ చేస్తున్నారన్న వాదన వైసీపీ నుంచి వినిపిస్తున్న నేపథ్యంలో పవన్ ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు.. ఇచ్చిన ఆదేశాలతో ఏమేరకు సక్సెస్ అయ్యారన్నది ప్రశ్న. అయితే..గతంలో సోషల్ మీడియాపై ఉక్కుపాదం మోపి.. పోసాని కృష్ణ మురళి సహా అనేక మందిని లైన్‌లోకి తీసుకువచ్చినట్టే.. ఇప్పుడు కూడా అదే తరహాలో అక్రమార్కు లకు చెక్ పెడతారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా రేషన్ అక్రమాలకు సంబంధించిమాజీ మంత్రి పేర్ని నాని కుటుంబంపై కూడా అప్పట్లో చ ర్యలు తీసుకున్నారు. దీంతో కృష్ణాజిల్లాలో అక్రమాలు దారిలో పడ్డాయి. ఇలానే ఇప్పుడు దృష్టి పెట్టిన సమస్యలు కూడా పరిష్కారం అవుతాయని పరిశీలకులు చెబుతున్నారు. ఇతర నేతల మాదిరిగా పవన్ తొందర పడే మనస్తత్వం లేదని. ముందుగా అధ్యయనం చేసి.. నెమ్మదిగా కార్యాచరణను ప్రారంభిస్తారని అంటున్నారు. చివరకు అక్రమార్కులకు చుక్కలు చూపించడం ఖాయమని జనసేన వర్గాలు చెబుతున్నాయి.

# అవతార్-3 వచ్చేస్తోంది..
## రికార్డు స్థాయిలో రన్ టైమ్!



హాలీవుడ్ సంచలన దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టిస్తున్న దృశ్య కావ్యం 'అవతార్' సిరీస్‌కు సంబంధించి ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ ఫ్రాంచైజీలో మూడో భాగంగా రానున్న 'అవతార్: ఫైర్ అండ్ ఆష్' సినిమా రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 15 నిమిషాల (195 నిమిషాలు) నిడివితో రానుండటం విశేషం. దీంతో 'అవతార్' సిరీస్‌లోనే ఇది అత్యంత అధిక నిడివి గల చిత్రంగా రికార్డు సృష్టించనుంది.
గతంలో వచ్చిన 'అవతార్' (2009) మొదటి భాగం 2 గంటల 58 నిమిషాలు ఉండగా, రెండో భాగం 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' 3 గంటల 12 నిమిషాల నిడివితో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇప్పుడు మూడో భాగం అంతకుమించిన నిడివితో రాబోతోంది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా 2025 డిసెంబర్ 19న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పండోరా గ్రహం నేపథ్యంలో సాగే ఈ కథలో ఈసారి ఓ కొత్త విలన్‌ను పరిచయం చేయబోతున్నారు. 'వరాంగ్' అనే ఈ పాత్రలో నటి ఊనా చాప్లిన్ కనిపించనుంది. పండోరా జీవధార అయిన ఐవా ను వ్యతిరేకించే తొలి నావి పాత్ర ఇదే కావడం కథలో కీలక మలుపు కానుంది.ఈ సినిమా గురించి దర్శకుడు జేమ్స్ కామెరూన్ మాట్లాడుతూ.. "గత భాగాలతో పోలిస్తే ఇది మరింత ఉత్కంఠభరితంగా, భావోద్వేగభరితంగా, భారీ స్థాయిలో ఉంటుంది" అని తెలిపారు. సామ్ వర్తింగ్టన్, జోయ్ సల్డానా, సిగోర్నీ వీవర్, కేట్ విన్‌స్లెట్ వంటి పాత తారాగణంతో పాటు కొత్తగా ఊనా చాప్లిన్ కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు.

# సంక్రాంతి రిలీజ్ కోటాలో అఖండ-2 ?




టాలీవుడ్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సీక్వెల్‌లలో 'అఖండ 2' ఒకటి. నందమూరి బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. 'అఖండ' బ్లాక్‌బస్టర్ విజయానంతరం వస్తున్న సీక్వెల్ కావడంతో అభిమానుల్లో ఉత్కంఠ పీక్స్‌కి చేరింది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త మీనన్, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సోషల్ మీడియాలో దుమ్మురేపింది. బాలయ్య పవర్‌ఫుల్ లుక్, బోయపాటి స్టైల్ మాస్ ఎలివేషన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. సినిమా షూటింగ్, డబ్బింగ్ పూర్తయ్యాయి. అయితే, విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఇంకా వేగంగా సాగుతున్నాయి. మేకర్స్ ముందుగా ప్రకటించిన డిసెంబర్ 5 రిలీజ్ ఇప్పటికి అనుమానాస్పదంగా మారింది. రిలీజ్‌కి ఇంకా 20 రోజులు మాత్రమే ఉన్నప్పటికీ, ప్రమోషన్స్‌లో అంత వేగం కనిపించక పోవడంతో మూవీ విడుదలపై అనుమానాలు మొదలయ్యాయి. అంతేకాక ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, మేకర్స్ ఇప్పుడు సంక్రాంతి రిలీజ్ పై దృష్టి పెట్టారని వార్తలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది జనవరి 9న విడుదల కావాల్సిన రాజాసాబ్ సినిమా పనులు పూర్తి కావడం లేదని , దీంతో ఆ స్లాట్ ఖాళీ కావచ్చని టాక్ వినిపిస్తున్న నేపథ్యంలో ఆ తేదీకి అఖండ 2ను రిలీజ్ చేసేందుకు టీమ్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇదే నిజమైతే, ఈసారి సంక్రాంతికి బాలయ్య ,చిరంజీవి బాక్సాఫీస్ క్లాష్ జరిగే అవకాశం ఉంది. చిరంజీవి 'మన శంకర వరప్రసాద్ గారు చిత్రం'తో రానుండగా, బాలయ్య 'అఖండ 2'తో దుమ్మురేపేందుకు రెడీ అవుతున్నారు. ఇప్పటికే అభిమానులు సోషల్ మీడియాలో 'అఖండ 2 ఎప్పుడు రిలీజవుతుంది?', 'సంక్రాంతికేనా?' అని ప్రశ్నలు కురిపిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే రిలీజ్‌పై స్పష్టమైన ప్రకటన ఇవ్వనున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో అఖండ 2 రిలీజ్ డేట్ చర్చ హాట్ టాపిక్‌గా మారింది.

# నేడు రామోజీలో ఎస్ఎస్ఎంబీ29' మూవీ ఈవెంట్
## పాస్ ఉంటేనే రావాలన్న దర్శకుడు రాజమౌళి





మహేశ్‌బాబు కథానాయకుడిగా దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో భారీ యాక్షన్ అడ్వెంచర్ తెరకెక్కుతున్న 'ఎస్-ఎస్ఎంబీ29' మూవీకి సంబంధించి శనివారం రామోజీ ఫల్మ్ సిటీలో భారీ ఈవెంట్ ప్లాన్ చేశారు. దీనికి ప్రత్యేకంగా పాస్‌లు కూడా విడుదల చేశారు. ఈ చిత్రాన్ని శ్రీదుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్ నారాయణ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా కోసం అభిమానులు, ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దర్శకుడు రాజమౌళి ఈ చిత్రానికి సంబంధించి ఏ సమాచారం లేకుండా పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా లుక్‌లతోపాటు సంచారి పాటను విడుదల చేసి సినిమాపై మరింత ఆసక్తి రేకెత్తిస్తున్నారు. ఈ నెల 15న రామోజీ ఫిల్మ్ సిటీ ఈ చిత్రానికి సంబంధించి ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జియో హాట్‌స్టార్‌లో ఈ వేడుక స్ట్రీమింగ్ కానుంది. దీనికి సంబంధించిన కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈవెంట్‌ను వీక్షించడానికి వచ్చే అభిమానులు, ప్రేక్షకుల కోసం చిత్ర బృందం ప్రత్యేకంగా పాస్‌లు సిద్ధం చేసింది. పాస్‌పోర్ట్ తరహాలో తీర్చిదిద్దిన ఈ పాస్‌లకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్‌కు సంబంధించి ఆయన పుట్టినరోజులు విడుదల చేసిన ప్రీలుక్‌లో ధరించిన త్రిశూలం బొమ్మతో ప్రింట్ చేసిన పాస్‌లో లోపల పేజీలో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్, రాజమౌళి ఫొటోలను, ఈవెంట్‌కు వచ్చేవారు పాటించాల్సిన సలహా, సూచనలు, రూట్ మ్యాప్ అందులో ఉంచారు. ప్రస్తుతం ఈ ఇన్విటేషన్ ప్రేక్షకుల్ని ఆకర్షిస్తోంది. అంతే కాదు ఈ కార్యక్రమానికి వచ్చే ప్రేక్షకులకు జాగ్రత్తలు చెబుతూ రాజమౌళి ఓ ప్రత్యేక వీడియో కూడా విడుదల చేశారు. ఆ ఈవెంట్‌కు పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతిస్తారని, పాస్ లేకుండా వచ్చి ఇంబ్బందులకు గురి కావొద్దని రాజమౌళి స్పష్టం చేశారు. ఈ ఇన్విటేషన్ చూసి రాజమౌళి ఆలోచనలు.. ప్లానింగ్ నెక్ట్స్ లెవల్ అంటూ, నీ ఇన్నోవేటివ్ థాట్స్ వర్త్ జక్కన్న వర్త్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# షారూఖ్ ఖాన్‌ను డైరెక్ట్ చేయనున్న బుచ్చిబాబు?



'ఉప్పెన' సినిమాతో మంచి హిట్ అందుకున్న యువ దర్శకుడు బుచ్చిబాబు సానా ఇప్పుడు పెద్దితో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా రూపొందుతున్న 'పెద్ది' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీకి సంబంధించి విడుదలైన వీడియోలు సినిమాపై భారీ అంచనాలు పెంచాయి. మూవీ హిట్ అనే అభిప్రాయానికి వచ్చేశారు ఫ్యాన్స్.ఇక 'పెద్ది' తరువాత బుచ్చిబాబు తన కెరీర్‌లో మరో భారీ ప్రాజెక్ట్ సిద్ధమవుతున్నట్టు సమాచారం. గత కొంతకాలంగా మైత్రి మూవీ మేకర్స్ తెలుగు మాత్రమే కాకుండా తమిళం, హిందీ భాషల్లోనూ సినిమాలు నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే తమిళంలో గుడ్ బ్యాడ్ అగ్లీ, హిందీలో జాట్ సినిమాలు నిర్మించిన ఈ బ్యానర్, ఇప్పుడు బాలీవుడ్ లో సూపర్ క్రేజీ ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తోందట. ఇటీవలే మైత్రి మూవీ మేకర్స్ ప్రతినిధులు షారుఖ్ ఖాన్‌ను కలిసి ప్రాజెక్ట్ గురించి చర్చలు జరిపినట్లు సమాచారం.
ఈ భారీ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి దర్శకుడిగా బుచ్చిబాబును ఎంపిక చేసినట్టు సమాచారం. 'ఉప్పెన' నుంచి 'పెద్ది' వరకు తన పనితీరుతో ఆకట్టుకున్న బుచ్చిబాబు.. షారూఖ్ లాంటి స్టార్‌ని డైరెక్ట్ చేయడం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలలో చర్చనీయాంశం అయింది.

# ఈ నెలాఖరులో స్పిరిట్ రెగ్యులర్ షూటింగ్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బ్జడెట్‌తో తెరకెక్కనుంది. ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మూవీ నుంచి ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అప్‌డేట్ అంటూ అనౌన్స్‌మెంట్‌ను వీడియోను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ షూటింగ్‌కి సంబంధించి దర్శకుడు సందీప్ రెడ్డి వంగ స్పందించాడు. ఈ సినిమా షూటింగ్‌ను నవంబర్ ఎండింగ్‌లో ప్రారంభించ బోతున్నట్లు సందీప్ రెడ్డి వెల్లడించాడు. నవంబర్ తర్వాత రెగ్యులర్ షూటింగ్ ఉండబోతుందని 2026లో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నమని సందీప్ తెలిపాడు. అయితే ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి ప్రభాస్ తండ్రి పాత్రలో నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలను సందీప్ ఖండించాడు. ఇక ఈ చిత్రంలో యానిమల్ భామ తృప్తి డిమ్రి కథానాయికగా నటించబోతుంది.

# రివాల్వర్ రీటాగా వస్తోన్న కీర్తి సురేశ్

విభిన్న పాత్రలతో దూసుకుపోతున్న అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. ఈ సినిమాకు కె. చంద్రు దర్శకత్వం వహిస్తుండగా.. సీనియర్ నటి రాధికా శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. కీర్తి సురేశ్ ఈ సినిమాలో 'రీటా' అనే సామాన్య మధ్యతరగతి యువతి పాత్రలో కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల కారణంగా ఆమె తుపాకీ (రివాల్వర్) పట్టుకోవాల్సి వస్తుంది. ఆ తర్వాత ఆమె ఎలాంటి సాహసాలు, సవాళ్లు ఎదుర్కొంది అనేది ప్రధాన కథాంశం. ఇది కామెడీ అంశాలతో కూడిన పక్కా యాక్షన్ థ్రిల్లర్ చిత్రంగా రాబోతుంది.






## శ్రీవారిని దర్శించుకున్న
# అంజలి

కలియుగ దైవం తిరుమల శ్రీవారిని నటి అంజలి, నటుడు శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో వీరిద్దరూ కలిసి స్వామివారి దివ్య దర్శనంలో పాల్గొన్నారు. దర్శనం పూర్తయిన తర్వాత రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామివారి పవిత్ర తీర్థం ప్రసాదాలు సమర్పించారు. 'గీతాంజలి', 'గీతాంజలి మళ్లీ వచ్చింది' వంటి సూపర్‌హిట్ చిత్రాలతో నటి అంజలి, నటుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే.